Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కళం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

గురువారం | 05-11- 2026 | సంపుటి: 17, సంచిక: 215, పేజీలు: 12, వెల: 3/-



పదవిలో ఉన్నా..

రిటైరైనా రక్షణేనా?

కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు కల్పించిన చట్టపరమైన రక్షణ ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. అధికారిక విధుల నిర్వహణకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులు కొనసాగించకుండా అడ్డుకునే 2023 చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. 2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ చట్టంలోని సెక్షన్ 16 ప్రకారం.. సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, గతంలో ఆ పదవిలో

తరువాయి 2వ పేజీలో...

యాదవుల సంక్షేమానికీ

అండగా ప్రభుత్వం

సదర్ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు

ఇది యాదవులకే కాదు.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనం

హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ

యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందింది



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

యాదవుల ఆత్మగౌరవం, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. వారి సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సదర్ సమ్మేళనం కేవలం యాదవుల

తరువాయి 2వ పేజీలో...



కండక్టర్ ప్రవళికకు

కన్నీటి వీడ్కోలు

- మణుగూరులో అంతిమ సంస్కారాలు..
- నివాళులర్పించిన కార్మికులు, ఉద్యోగులు
- రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన
- కండక్టర్ మృతిపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

ఖమ్మం నవంబరు 4 (ప్రజాకలం) :

ప్రయాణికురాలి దాడిలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళికకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు కన్నీటి వీడ్కోలు పలికారు. తమతో కలిసి పనిచేసిన కండక్టర్ ఇక లేదంటూ సహ ఉద్యోగినులు కన్నీటిపర్యంతమయ్యారు. గతనెల 25న చిల్లర డబ్బుల విషయమై గొడవపడిన ప్రయాణికురాలు బస్సులో నుంచి తోసేయడంతో తీవ్రంగా గాయపడిన ప్రవళిక.. మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రవళిక మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

తరువాయి 2వ పేజీలో...

ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు

ఆర్టీసీ తరఫున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

బ్యాంకు నుంచి రూ.కోటి బీమా: మంత్రి పొన్నం



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కండక్టర్ ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఉస్మానియా మార్చురీలో ఉన్న ప్రవళిక మృతదేహాన్ని బుధవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి తల్లి విజయలక్ష్మిని ఓదార్చారు.

తరువాయి 2వ పేజీలో...

వికసిత భారత్ నిర్మాణమే మన ముందున్న లక్ష్యం

దేశంలో మిగిలిన నక్సలిజంపై పోరాటం కొనసాగించాలి: బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్

తెలంగాణను అభివృద్ధి చెందిన, బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలి.. కార్యకర్తలకు పిలుపు



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

ఎన్నో ఏళ్లుగా కన్న కలలు నేడు సాకారమవుతున్నాయని, వికసిత భారత్ నిర్మాణమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్ అన్నారు. దేశంలో ఇంకా మిగిలి ఉన్న నక్సలిజంపై పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత అభివృద్ధిని మన కళ్లతో చూడాలన్నదే ప్రతి జాతీయవాది లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, జాతీయవాద భావజాలం, దేశభక్తి విలువలను పరిరక్షించడంతోపాటు జాతీయ చైతన్యాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షనల్ హాల్‌లో జాతీయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సునీల్ బన్సాల్ హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక సహ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ బన్సాల్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో దేశంలో అనేక కీలక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు చారిత్రక పరిణామాలని పేర్కొన్నారు. భారత్ నక్సలిజం నుంచి విముక్తి దిశగా ముందుకు సాగుతోందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

‘మాది మెరిట్ కోటా.. మీది మేనేజ్‌మెంట్ కోటా’

కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌ను ఉద్దేశించి ‘ట్విట్టర్ టిల్లు.. మీది మేనేజ్‌మెంట్ కోటా.. మాది మెరిట్ కోటా’ అంటూ ఎద్దేవా చేశారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చి పదవులు సంపాదించుకున్న చరిత్ర కేటీఆర్‌దని, తాము మాత్రం ప్రజల కోసం కష్టపడి, లాఠీ దెబ్బలు తిని, ఉద్యమాలు చేసి కార్యకర్త స్థాయి నుంచి ఈ స్థాయికి ఎదిగామని వ్యాఖ్యానించారు. అమిత్ షా పాదయాత్రకు భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారని, వారిని నియంత్రించేందుకు తాను వెళ్లినప్పుడు కేటీఆర్ బౌన్సర్ అంటూ హేళన చేయడం సరికాదన్నారు. తమ పార్టీకి వచ్చిన జన సందోహాన్ని క్రమబద్ధీకరించేందుకు వెళితే బౌన్సర్‌గా కనిపిస్తున్నామా? అని ప్రశ్నించారు. బౌన్సర్లతో కార్యకర్తలపై దాడులు చేయించిన సంస్కృతి బీఆర్ఎస్‌దేనని మండిపడ్డారు.

తరువాయి 2వ పేజీలో...

కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి 9 వరకు

మెగా రైతు మేళా

నవంబర్ 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం


150 ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు

మూడు రోజుల పాటు రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన..

శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సమావేశాలు

చివరి రోజు పారుగు జిల్లాల నుంచి 50 వేల మంది రైతుల హాజరవుతారని అంచనా

రైతులందరూ మెగా రైతు మేళాను సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిని ప్రదర్శించే లక్ష్యంతో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్‌లో మూడు రోజుల పాటు మెగా రైతు మేళాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నవంబర్ 7వ తేదీన ఉదయం 10 గంటలకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో ఈ మేళాను ప్రారంభించనున్నారని వెల్లడించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి గారు, మంత్రులు ప్రదర్శన స్టాళ్లను సందర్శించనున్నారు. ఈ మెగా రైతు మేళాలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖ, బ్యాంకింగ్ సంస్థలు, విత్తన పరిశ్రమ, వాలంతరి , క్రిడా, కేంద్ర ప్రభుత్వ సంస్థలు సహా మొత్తం 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో సుమారు 150 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

కాంగ్రెస్ హయాంలోనే పట్టణాల

సమగ్రాభివృద్ధి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు
- రూ. 12.47 కోట్లతో పలు వార్డుల్లో పనులకు శ్రీకారం



14 లోక్‌సభ సీట్లు గెలిచి తీరుతాం

ప్రధాని పదవి పుట్టిందే రాహుల్ ఇంట్లో..- ఆయన అవ్వాలనుకుంటే 2004లోనే అయ్యేవారు

రాముని పేరు చెప్పుకొని 3 సార్లు మోదీనే ప్రధాని అయ్యారు : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి



హైదరాబాద్, నవంబరు 4 (ప్రజాకలం) :

దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీయేనని.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దీన్ని ఒక చాలెంజ్‌గా తీసుకుంటుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 14 సీట్లలో గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ తలచుకుంటే 2004లోనే దేశానికి ప్రధాని అయ్యుండేవారన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ దేశ ప్రధాని అయ్యే అవకాశం లేదంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. బీజేపీ అధికారంలోకి రాకముందు ఏం జరిగిందో ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకో వాలని సూచించారు. ప్రధాని పదవే రాహుల్ కుటుంబంలో పుట్టిందన్న సంగతి ఆయన మరిచిపోతున్నారన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలు జవహర్‌లాల్ నెహ్రూను భారత ప్రధానిగా నేరుగా ఎన్నుకున్నారని గుర్తు చేశారు. ‘2004లో కేంద్రంలో సోనియా గాంధీ నేతృత్వంలో

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



యాదవుల సంక్షేమానికీ అండగా ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి...

వేడుక మాత్రమే కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అభివర్ణించారు. యాదవుల చిరకాల ఆకాంక్షను గుర్తించి సదర్ వేడుకలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సమాజం అందించిన సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో యాదవులకు తగిన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని వివరించారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించిన విషయాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులోనూ యాదవులకు దక్కాల్సిన అవకాశాలు, వాటా వారికి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్రను గుర్తుచేస్తూ.. నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. గోల్కొండ ప్రాంతానికి ఉన్న చారిత్రక గొల్లంకొండ ప్రస్తావనను కూడా తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికి తెలంగాణ ఒక నమూనాగా నిలిచిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సి ఉందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు. వారి ఆత్మగౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని మరోసారి స్పష్టం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీ
అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..

దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనేదే తమ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని.. ఇందుకు యాదవ సోదరుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ అని ప్రస్తావించారు. యాదవ సోదరుల సహకారం తోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పుకొచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు.

తెలంగాణలో కులగణన చేశాం..

సదర్ సమ్మేళనం నిర్వహణకు తమ ప్రభు త్వంలో రూ. 5 కోట్లు మంజూరు చేశామని ముఖ్య మంత్రి వెల్లడించారు. తెలంగాణలో తాము కులగణన చేసి చూపించామని ఉద్ఘాటించారు. రాష్ట్ర మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని వెల్లడించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని ప్రస్తావించారు. యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే యాదవుల కు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థుల యూనిఫాంలపై
సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం

విద్యార్థుల యూనిఫాంలపై ఫీడ్‌బ్యాక్ తీసు కోవాలని అధికారులను.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. యూనిఫాంల రంగులు, డిజైన్లపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థులకు యూనిఫాం, కిట్స్ పంపిణీపై సీఎం బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

యూనిఫాంలు, కిట్ల పంపిణీకి
ప్రత్యేక ఎస్‌వోపీ రూపొందించాలి..

విద్యార్థులు కోరుకున్న రంగులు, డిజైన్లకు భవిష్యత్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. యూనిఫాంలు, కిట్ల పంపిణీకి ప్రత్యేక ఎస్‌వోపీ రూపొందించాలని ఆదేశించారు. స్కూల్ బ్యాగులు, షూలు, సాక్సులతో సహా కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశించారు. మిగిలిన వస్తువుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు పూర్తి కిట్లు అందించాలని సూచించారు. టెండర్లు, సరఫరా, పంపిణీకి ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ బోట్ల గల్లంతుపై సీఎం ఆరా

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్‌ఎఫ్ బోట్ల గల్లంతుపై సీఎం రేవం త్‌రెడ్డి ఆరా తీశారు. ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సురక్షితం గా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలనుముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు.
పరిస్థితి ని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం తరపున సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. మృతురాలి తల్లి విజలక్ష్మికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం, ఆర్టీసీ నుంచి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. అలాగే, బ్యాంకు నుంచి రూ. కోటి ప్రమాద బీమా అందిస్తామని చెప్పారు. కండక్టర్ మృతికి కారణమైన మహిళపై హత్య కేసు నమోదైందని, చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది పనితీరుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయాలే తప్ప ఇలా దాడులకు పాల్పడటాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రయాణికులు సంయమనంతో వ్యవహరిస్తూ ఆర్టీసీకి సహకరించాలని కోరారు. మహిళా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరోగ్యం మెరుగుపడి తిరిగి విధులకు హాజరవుతారని భావించామని, ఇలా జరగడం బాధాకరమన్నారు. సిబ్బందిపై ఈ తరహా దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, యూనియన్ నేతలు గోపాల్, రఘు తదితరులు ప్రవళిక మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వికసిత భారత్ నిర్మాణమే మన ముందున్న లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

వికసిత భారత్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని అన్నారు. పశుపతినాథ్ ఆలయం నుంచి రుద్రాక్షమాల, కాషాయ వస్త్రాలతో మోదీ వచ్చిన సందర్భాన్ని, మైనస్ ఉష్ణోగ్రతల్లో సరిహద్దుల్లో సైనికులతో కలిసి దీపావళి జరుపుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అమెరికా గడ్డపై భారత్ మాతాకీ జై నినాదం వినిపించడం, స్వచ్ఛ భారత్ కోసం స్వయంగా ప్రధాని చీపురు పట్టడం దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపాయన్నారు. భారత్ అభివృద్ధిని మన కళ్లతో చూడటమే కాకుండా, తెలంగాణను కూడా అభివృద్ధి చెందిన, బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మార్పు తీసుకొచ్చేందుకు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. సంస్థాగత శక్తిని పెంపొందించుకుంటూ తమ ఆలోచనలకు అనుగుణమైన వ్యవస్థ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో వచ్చేది
బీజేపీ ప్రభుత్వమే: రామచందర్ రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ.. కాసం వెంకటేశ్వర్లు ఏబీవీపీ నుంచి అంచెలంచెలుగా ఎదిగి కర్ణాటక సహ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏబీవీపీని బలోపేతం చేసిన నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. ఏబీవీపీ, యువమోర్చా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించి జాతీయ స్థాయికి ఎదిగారని తెలిపారు. ఏఐఎస్ఏ వంటి విద్యార్థి సంఘాలు దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో జాతీయ భావన పెరుగుతోందని, దానిని మరింత బలోపేతం చేసేందుకు జాతీయవాదులంతా కృషి చేయాలని కోరారు. గతంలో ఏబీవీపీ కార్యకర్తలపై హత్య కేసులు నమోదు చేసిన సందర్భాలున్నాయని పేర్కొన్నారు. వ్యక్తులపై ఆధారపడకుండా పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

సిద్ధాంత పరిరక్షణ కోసం
పనిచేయాలి: కాసం వెంకటేశ్వర్లు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక సహ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏబీవీపీలో పనిచేసిన అనేక మంది సీనియర్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అందరూ తమ అభిప్రాయాలను పంచుకుంటూ జాతీయవాద భావజాలాన్ని బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కమ్యూనిస్టులు ఏబీవీపీ కార్యకర్తలపై దాడులు చేసినప్పుడు ఎదురుదాడి చేసిన చరిత్ర ఉందన్నారు. ఎంతోమంది త్యాగాల ఫలితంగానే నేడు ఈ స్థాయిలో ఉన్నామని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎప్పుడూ పదవులు, డబ్బు ఆశించకుండా సిద్ధాంతం బతకాలని, దేశం కోసం పనిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగారని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడానికి సునీల్ బన్సాల్ కీలకంగా పనిచేశారని కొనియాడారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో తెలంగాణ గడ్డపై కూడా కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం తమకుందని, ఒకరోజు గోల్కొండ కోటపై బీజేపీకి చెందిన వ్యక్తి జాతీయ జెండా ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జాతీయవాదులను అణచివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం నక్సలిజం నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటోందని అన్నారు. నేహా బోరా బంగ్లాదేశ్‌ను ఆదర్శంగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయవాద కార్యకర్తలంతా సిద్ధాంత పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు దేశద్రోహ శక్తులను ఎదుర్కొంటూ ప్రజల్లో జాతీయవాద భావజాలాన్ని విస్తరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పదవిలో ఉన్నా.. రిటైరైనా రక్షణేనా?

మొదటి పేజీ తరువాయి...

ఉన్న వ్యక్తి అధికారిక విధుల నిర్వహణలో చేసిన చర్యలు లేదా మాట్లాడిన మాటలకు సంబంధించి కోర్టులు సివిల్, క్రిమినల్ కేసులను స్వీకరించకూడదు. ఇప్పటికే విచారణలో ఉన్న కేసులను కూడా కొనసాగించడానికి వీల్లేదని ఈ నిబంధన పేర్కొంటోంది. ఈ రక్షణ పదవీ విరమణ తర్వాత కూడా వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించి రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక విధుల పేరుతో దురుద్దేశపూర్వకంగా వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం దొరకని పరిస్థితి ఏర్పడుతుందని వాదిస్తున్నారు. ఈ నిబంధన రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలకు, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. ఓటరు జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగించడం, ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులకు అన్యాయం జరగడం లేదా ఎన్నికల సంఘం పనితీరుపై అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో బాధితులకు న్యాయపరమైన మార్గాలు పరిమితమవుతాయని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడానికి రక్షణ అవసరమే అయినా, అది చట్టపరమైన జవాబుదారీతనాన్ని పూర్తిగా తొలగించే స్థాయిలో ఉండకూడదని వాదించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్‌తో పాటు ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా దాఖలు చేసిన పిటిషన్లలోని అంశాలను పరిశీలించింది. సెక్షన్ 16ను చట్టంలో చేర్చడానికి గల కారణాలు, దాని అవసరం, రాజ్యాంగబద్ధతపై కేంద్రం, ఎన్నికల సంఘం తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆదేశించింది. 2023లో ప్రవేశపెట్టిన అసలు బిల్లులో ఎన్నికల కమిషనర్లకు ఈ తరహా విస్తృత రక్షణ కల్పించే నిబంధన లేదని పిటిషనర్లు పేర్కొన్నారు.
అనంతరం సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, అందుకు తగిన వివరణ ఇవ్వలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో ఈ నిబంధనతో కూడిన బిల్లు ఆమోదం పొందిన అంశాన్ని కూడా తమ వాదనల్లో ప్రస్తావించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు తదుపరి విచారణలో కేంద్రం, ఎన్నికల సంఘం సమర్పించే సమాధానాలు కీలకం కానున్నాయి. సెక్షన్ 16 కొనసాగింపుపై తుది నిర్ణయం మాత్రం న్యాయస్థానం విచారణ అనంతరమే వెలువడనుంది.

14 లోక్‌సభ సీట్లు గెలిచి తీరుతాం

మొదటి పేజీ తరువాయి...

యూపీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఆ సమయంలో సోనియా లేదా రాహుల్ ప్రధాని కావాలంటూ అప్పటి ఎంపీలు అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కానీ తమకు ఆ పదవి వద్దంటూ సోనియా, రాహుల్‌లు తిరస్కరించారు. మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారు. రెండో సారి యూపీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రాహుల్‌ను ప్రధాని పదవి తీసుకోవాలంటూ మన్మోహన్‌సింగ్ కోరారు. కానీ అప్పుడూ రాహుల్ ఆ ప్రతిపాదనను తిరస్కరించి.. మన్మోహన్‌నే ప్రధానిగా కొనసాగాలని కోరారు' అని వివరించారు. రాహుల్ ప్రధాని కాలేరంటూ చెప్పడానికి అమిత్‌షా ఎవరని ప్రశ్నించారు. రాహుల్ ప్రధాని కావాలనుకుంటే అయిపోతారని, దేశ ప్రజలు ఆయన్ను ప్రధానిని చేస్తారని అన్నారు. ఈ దేశ ఓటర్లను శాసించే హక్కు అమిత్‌షాకు లేదని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 సీట్లకుగాను 14 సీట్లు గెలుచుకుని ఆయన అహంకారపు మాటలకు సమాధానం ఇస్తామని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి బలముంది కానీ.. బీజేపీకి లేదన్నారు. రాహుల్‌ను ప్రధానిని చేయడమన్నది ఒక చాలెంజ్‌గా తీసుకుని పనిచేస్తామని స్పష్టం చేశారు.

రాముడి పేరుతో రాజకీయాలు..

శ్రీరాముని పేరుతో మూడు సార్లు ప్రధాని అయిన మోదీ.. ఆ శ్రీరాముని అడుగుజాడల్లో మాత్రం దేశాన్ని పరిపాలించట్లేదని జగ్గారెడ్డి విమర్శించారు. కేవలం రాజకీయాల కోమే శ్రీరాముని పేరును ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే రఘుపతి రాఘవ రాజారాం అంటూ మహాత్మా గాంధీ.. శ్రీరాముడి భజన చేశారని గుర్తు చేశారు. అప్పటికీ బీజేపీ గానీ, మోదీ, అమిత్‌షాలు కానీ పుట్టలేదన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతోనూ ఓట్లు తీసుకునే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు. వాస్తవానికి ఆయన పక్కా కాంగ్రెస్ పార్టీ అని, నెహ్రూ క్యాబినెట్‌లో మంత్రి అని గుర్తు చేశారు. నెహ్రూ డైరెక్షన్‌లోనే హైదరాబాద్ సంస్థానాన్ని పటేల్.. దేశంలో విలీనం చేశారన్నారు.

'మాది మెరిట్ కోటా.. మీది మేనేజ్‌మెంట్ కోటా'

మొదటి పేజీ తరువాయి...

అధికారంలో ఉన్నంతకాలం కార్యకర్తలను పట్టించుకోని చరిత్ర కూడా ఆ పార్టీకే ఉందన్నారు. తెలంగాణలో భూములను విక్రయించి దోచుకున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని బండి సంజయ్ ఆరోపించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మియాపూర్ భూములను సైతం అడ్డికి పావుశేరుకు విక్రయించి కేసీఆర్ కుటుంబం దోచుకోవాలని చూసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా వదిలేసి, మియాపూర్ భూములను విక్రయించి ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు.

ఆర్టీసీ కార్మికుల పట్ల
మానవతా దృక్పథం చూపాలి

మహిళల మధ్య జరిగిన తోపులాటలో కిందపడి ఆర్టీసీ కండక్టర్ మరణించడం అత్యంత బాధాకరమని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని ఆర్టీసీ కార్మికులపై చూపించి వారిపై పగ తీర్చుకునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆర్టీసీ కార్మికులు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నారని కొనియాడారు.
పదవీ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యం కూడా లేని పరిస్థితుల్లో ఆర్టీసీ ఉద్యోగులు జీవనం సాగిస్తున్నారని, రిటైర్మెంట్ తర్వాత వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ కోటి మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఘనత ఆర్టీసీ కార్మికులదేనన్నారు. ఎన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఓపికతో సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని బండి సంజయ్ కోరారు.

కండక్టర్ ప్రవళికకు
కన్నీటి వీడ్కోలు

మొదటి పేజీ తరువాయి...

మ ణుగూరుకు తీసుకురాగా.. కుటుంబసభ్యులు, తోటి కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. ప్రవళిక మృతదేహాన్ని తొలుత మణుగూరు డిపో వద్ద సందర్శనకు ఉంచగా ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం సరిరామ్‌తో పాటు పలువురు ఆర్టీసీ ఉన్నతోద్యోగులు సంతాపం తెలిపారు. 'తల్లీ.. ప్రవల్లికా.. లే అమ్మా.. నాకు ఇంకెవ్వరు ఉన్నారమ్మా.. ఒంటరి దాన్ని చేసి వెళ్లిపోయావా' అంటూ ప్రవళిక తల్లి విజయలక్ష్మి గుండెలవిసేలా రోదించారు. ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రవళిక మృతదేహం వద్ద నివాళులర్పించారు. అమర్ రహే ప్రవళిక అమర్ ర హే, వీ వాంట్ జస్టిస్ అంటూ కార్మికులు నినాదాలు చేశారు. వందలాది మంది కార్మికులు, ప్రవళిక కుటుంబ సభ్యుల కన్నీటి మధ్య అంతిమయాత్ర నిర్వహించి.. మణుగూరు శివారులోని కట్టుమల్లారం వద్ద అంత్యక్రియలు చేశారు.
కాగా, ప్రవళిక మృతికి సంతాపంగా ఖమ్మం రీజియన్‌లో బుధవారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు విధులు బహిష్కరించి బస్సుల బంద్ నిర్వహించారు. ఉదయం నుంచే ఖమ్మం రీజియన్ పరిధిలోని 7డిపోల వద్ద ఆందోళనకు దిగారు. ప్రవళిక మృతికి కారకురాలైన మహిళను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ప్రవళిక కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం రీజియన్‌లో రోజూ 515 బస్సులు నడుస్తుండగా.. బుధవారం 37సర్వీసులే నడిచాయి. మధ్యాహ్నం తర్వాత సర్వీసులను పునరుద్ధరించామని అధికారులు తెలిపారు.

తండ్రి చనిపోయాక.. కండక్టర్‌గా..

మణుగూరు డిపోలో ఫిట్టర్‌గా పని చేసే నాగరాజు పది నెలల క్రితం మృతి చెందారు. కారుణ్య నియామకం కింద ఆయన కూతురు బీఈడీ చదివిన ప్రవళికకు కండక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. మణుగూరు డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఆమె ఓ మహిళా ప్రయాణికురాలి చేతిలో దాడికి గురై, పది రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొంది మరణించింది.
ప్రస్తుతం తల్లితో కలిసి మణుగూరులో అద్దె ఇంట్లో ఉంటున్న ప్రవళిక త్వరలోనే ఓ ఇల్లు కొనుక్కోవాలని, ఆతర్వాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇంతలోనే ఇంతటి దారుణం జరగడంతో కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ప్రవళిక మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని బుధవారం ఓ ప్రకటనలో హామీ ఇచ్చారు.
కాగా, మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడ్డ బానోతు మౌనికపై తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా హత్య కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే పట్టణాలసమగ్రాభివృద్ధి

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు – రూ. 12.47 కోట్లతో పలు వార్డుల్లో పనులకు శ్రీకారం

పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు,పట్టణాలు వేగంగా ప్రగతిపథంలో పయనిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి సుమారు రూ. 77 కోట్లు వెచ్చిస్తున్నామని,పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో యుఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. 5వ వార్డులో రూ. 3.85 కోట్లు, 9వ వార్డులో రూ. 2.45 కోట్లు, 10వ వార్డులో రూ. 3.24 కోట్లు, 11వ వార్డులో రూ. 2.93 కోట్లతో పలు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం రూ. 62.23 కోట్ల యుఐడీఎఫ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో ట్యూఫిడ్సి ద్వారా రూ. 35 కోట్లు, డీఎంఎఫ్‌టీ ద్వారా రూ. 15 కోట్లతో అన్ని వార్డుల్లో విస్తృతంగా పనులు చేపట్టామన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం రూ. 7 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపడుతున్నామని, దీనికి సంబంధించిన నిధులు కూడా మంజూరయ్యాయని వెల్లడించారు. జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ వంటి అనేక మౌలిక వసతుల కల్పన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు లేదా మౌలిక వసతుల అవసరాలు ఉంటే నేరుగా అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి 9 వరకు మెగా రైతు మేళా

మొదటి పేజీ తరువాయి...

వ్యవసాయ ఇన్‌పుట్స్, నూతన తరం రసాయనాలు, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, వివిధ శాఖల సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ కార్యక్రమాలను ఈ స్టాళ్ల ద్వారా ప్రదర్శించనున్నారని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలైన ప్రగతిశీల రైతులతో సాంకేతిక సమావేశాలు, ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అవకాశాలు, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలను వివరించనున్నారు.

మొదటి రోజు గౌరవ ముఖ్యమంత్రిగారితో రైతు మేళా ప్రారంభోత్సవం

నవంబర్ 7వ తేదీన మొదటి రోజు కొడంగల్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు ముందుగానే అల్పాహారం అందించడంతో పాటు కార్యక్రమ ప్రాంగణంలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి గారు మెగా రైతు మేళాను ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవం అనంతరం PJTAU, KLSHU శాస్త్రవేత్తలు, వివిధ అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ రంగ నిపుణులు, ప్రగతిశీల రైతులు, అవార్డు గ్రహీతలైన రైతులు తమ అనుభవాలు, పరిజ్ఞానం, విజయగాథలను రైతులతో పంచుకునేలా సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల కోసం 2,500 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన ప్రత్యేక హాలును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జరిగే చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విజయవంతమైన రైతుల అనుభవాలు, విజయగాథలను తెలియజేసే డాక్యుమెంటరీలు, వీడియోలను కూడా ప్రదర్శించనున్నారు. వైవిధ్యభరితమైన, అధిక ఆదాయం అందించే పంటల సాగును ప్రోత్సహించడం, సంప్రదాయ పంటలపై ఆధారపడటాన్ని తగ్గించడం, వ్యవసాయ ఆదాయాన్ని పెంచడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో నూతన అవకాశాలను అన్వేషించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు.
మొదటి రోజు ముఖ్యమంత్రి గారు, ఇతర ప్రముఖుల సమక్షంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, భూసార పరీక్ష కార్డులు, బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్లు, ఉద్యానవన శాఖకు సంబంధించిన డ్రిప్ సిస్టమ్స్ తదితర వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, యూనిట్లను రైతులకు అందించనున్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

- క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 04(ప్రజా కలం):జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి, తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి మండల తహసీల్దార్ , సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా తెలంగాణ రక్షణ సేన కమిటీ మెంబర్ గా చింతనిప్పుల మనోజ్ పటేల్



బెల్లంపల్లి, నవంబర్ 4, (ప్రజాకలం) ప్రతినిధి. తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల జిల్లా కమిటీ మెంబర్ గా బెల్లంపల్లికి చెందిన చింతనిప్పుల మనోజ్ పటేల్ నీ నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్ తెలిపారు.మనోజ్ పటేల్ మాట్లాడుతూ..తన పై ఎంతో నమ్మకంతో జిల్లా కమిటీ మెంబర్ గా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంచిర్యాల జిల్లా లో ప్రజలకున్న సమస్యలను పరిష్కరిస్తూ,యువతను ప్రోత్సహిస్తూ,పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతుందని,విద్యా, వైద్య ,వ్యవసాయం,ఉద్యోగం వంటి అనేక అంశాలపై ప్రజలకు పక్షాన పోరాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటి టిఆర్ఎస్ జండా ఎగరేవేస్తామని ధీమా వ్యక్తం చేశారు...

మంత్రి అడ్లూరిని మర్యాద పూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 04(ప్రజా కలం) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం జగిత్యాల జిల్లాకు వెళ్ళిన ఫెడరేషన్ నాయకులు అక్కడే జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షు కాసం శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కోశాధికారి కొండా సంజీవ కుమార్ తదితరులున్నారు.

ఎల్‌నినో పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి...

ఇబ్రహీంపట్నం నవంబర్ 4(ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం: ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదల, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు.ఇబ్రహీంపట్నం రైతు వేదికలో నిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, కుసుమతో పాటు తక్కువ వంట కాలం కలిగిన కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలని సూచించారు. వీటి ద్వారా నీటి వినియోగం, సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు.ఇరిగేషన్ ఏఈ చేతన్ మాట్లాడుతూ, చెరువుల్లోని నీటి మట్టాలను వివరించి, ఎల్‌నినో పరిస్థితుల్లో భూగర్భ జలాల రీఛార్జ్‌కు ప్రాధాన్యతనిస్తూ చెరువుల నుంచి సాగునీరు విడుదల చేయడం లేదని తెలిపారు.తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసే మార్గదర్శకాలను పాటించాలని, సందేహాల నివృత్తికి సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు చేతన్, కవిత, సర్పంచ్ బద్దం గోపి, ఏఈఓ వినోద్, రైతులు పాల్గొన్నారు.



ఎస్సీ గ్రూప్-3 రోస్టర్ పాయింట్లలో సవరణలు చేయాలి

- చట్టబద్ధమైన 5 శాతం రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు చేయాలి

- మెట్‌పల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం):- తెలంగాణ షెడ్యూల్డ్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) నియమాలు-2025 ప్రకారం ఎస్సీ గ్రూప్-3లోని మాల, ఇతర 25 కులాలకు కేటాయించిన రోస్టర్ పాయింట్లలో సవరణలు చేసి, చట్టబద్ధంగా కల్పించిన 5 శాతం రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాల యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నవంబర్ 4న మెట్‌పల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ గ్రూప్-3కు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పటికీ, ప్రస్తుత రోస్టర్ విధానంలో ఈ గ్రూపునకు మొదటి రోస్టర్ పాయింట్ 22వ స్థానంలో ఉండటం వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. తదుపరి రోస్టర్ పాయింట్లు 41, 62, 77, 91గా ఉండటంతో 20 లేదా అంతకంటే తక్కువ ఖాళీలతో వెలువడే అనేక ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గ్రూప్-3 అభ్యర్థులకు అవకాశం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టబద్ధంగా 5 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ, ఆచరణలో కొన్ని నియామకాల్లో సున్నా ప్రాతినిధ్యం, మరికొన్ని చోట్ల పరిమిత ప్రాతినిధ్యమే లభిస్తోందని తెలిపారు.ఎస్సీ గ్రూప్-3లోని కులాలకు మొదటి 20 రోస్టర్ పాయింట్లలో కనీసం రెండు పాయింట్లు కేటాయించాలని, రోస్టర్ పాయింట్లను సవరించిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. జోనల్ నియామకాల్లో, తక్కువ ఖాళీలు ఉన్న సందర్భాల్లో సంక్షిప్త రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని, ఇతర రిజర్వేషన్ కేటగిరీలకు కేటాయించిన రిజర్వేషన్లు లేదా రోస్టర్ పాయింట్లను తగ్గించడం తమ ఉద్దేశం కాదని, గ్రూప్-3 అభ్యర్థులకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమని సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హనుమండ్లు, బడే లక్ష్మణ్, ప్రవీణ్, సోమిడి శివ, రఘు, పవన్, నర్సయ్య, బలిజ రాజారెడ్డి, కార్తీక్, మహేందర్, శేఖర్, హైకోర్టు అడ్వకేట్ మహేంద్ర, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాల యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐజేయు సభ్యుడు విజయ్ మృతి బాధాకరం


టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం):- తోటి జర్నలిస్టు, ఐజేయు సభ్యుడు జంగం విజయ్ మృతిచెందడం అత్యంత బాధాకరమని టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విజయ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు జంగం విజయ్ మృతి కుటుంబానికి తీరని లోటని, సమాజానికి నిరంతరం వార్తలను అందిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టు సమాజంలో ఒకరిని కోల్పోవడం కలచివేస్తోందని పేర్కొన్నారు. జర్నలిస్టుల మధ్య ఉండే అనుబంధం, ఆత్మీయత ఎంతో విలువైనవని, విజయ్ మృతి వార్త తమను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని తెలిపారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సంతాప కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీశ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రటరీ పిండిరి శివకుమార్, పుండ్ర శశికాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్, యానం రాకేశ్, రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేశ్, బొల్లం రాజు, మాజీ అధ్యక్షుడు ఆగ సురేశ్, సభ్యులు ఆదిల్ పాషా, రమణ, శశికుమార్, అమ్ముల ప్రవీణ్, సమీర్ అలీ, తెలుకంటి గంగాధర్, చిన్నారెడ్డి, అజ్మీరా గంగాధర్, రమేశ్ నాయక్, జడల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- చెక్కులను పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఎండపల్లి, నవంబర్ 04 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రం లో తహసిల్దార్ కార్యాలయం ముందు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం రోజున 93 మంది లబ్ధిదారులకు రూ.53.73 లక్షల ఆర్థిక భరోసా కింద చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఆపదలో ఉన్న నిరుపేదలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నిర్వ హించిన కార్యక్రమం లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 36 మంది లబ్ధి దారులకు మొత్తం రూ. 36,04,176 రూపాయల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. గ్రామాల వారీగా అంబారిపేటకు 2, ఎండపల్లికి 7, గొడిశెల పేటకు 2, గుల్లకోటకు 13, కొండాపూర్‌కు 3, కొత్తపేటకు 2, మారేడుపల్లికి 2, ముంజంపల్లికి 1, పాత గూడూర్ కు 3, ఉండెడకు 1 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచే ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకం కింద మరో 57 మంది లబ్ధిదారులకు రూ. 17,69,500 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. దీంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ పథకాల ద్వారా మొత్తం 93 మంది లబ్ధిదారులకు రూ.53,73,676 విలువైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. పేదింటి ఆడబిడ్డల వివా హాలకు ఆర్థిక చేయూత నివ్వడం, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయం లో భరోసా కల్పించడం ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాల ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు రెవెన్యూ శాఖ, మండల పరిషత్ శాఖలు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నాయి.ఈ కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచ్ మారం సునీత జలేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎండపల్లి, వెల్గటూర్ మండలాల అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, తాటిపర్తి శైలేందర్ రెడ్డి, రాజారాంపల్లి సర్పంచ్, ఎండపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంఘు రమేష్ యాదవ్, పలు గ్రామాల సర్పంచులు జీరెడ్డి మహేందర్ రెడ్డి, గొల్లపెల్లి మల్లేశం గౌడ్, సింగిరెడ్డి లింగారెడ్డి,గాదం భాస్కర్, బాలసాని శారద-మల్లేశం గౌడు, పడిదం లావణ్య మొగిలి, ఆవుల మమత తిరుపతి, ఎంపీడీఓ దొండ కృపాకర్, తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఆర్ ఐ తోడేటి అన్వేష్, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కొమురయ్య, మల్లేశం హఫీజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టనున్న స్వప్నకు ఘన సన్మానం

గ్రూప్-2లో విజయం.. డిప్యూటీ తహసీల్దార్‌గా స్వప్న



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం):- జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్న వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బత్తుల స్వప్నను, ఆమె తండ్రి బత్తుల శంకర్‌ను మెట్‌పల్లి 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రూప్-2 పరీక్షలో విజయం సాధించిన బత్తుల స్వప్న నిజామాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకుని నేడు డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రెబ్బాస్ మహేష్ మాట్లాడుతూ స్వప్న సాధించిన విజయం వెంకట్రావుపేట గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఆమె కృషి, పట్టుదల గ్రామీణ ప్రాంతాల యువతీ యువకులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కుమార్తె ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అండగా నిలిచిన తండ్రి బత్తుల శంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

బెల్లంపల్లి వాల్యూపిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించిన జన్నారం పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినులు



బెల్లంపల్లి, నవంబర్4, (ప్రజాకలం) ప్రతినిధి. ఐటిఈఎస్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్) విభాగంలో,పారిశ్రామిక పర్యటన సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని వాల్యూపిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను బుధవారం జన్నారంకు చెందిన శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాల,60 మంది విద్యార్థినులు సందర్శించారు.ఈ సందర్భంగా సంస్థలో ఉద్యోగులు నిర్వహించే విధులు,పని చేసే విధానం, వివిధ రకాల ప్రాజెక్టులు,ఐటీ రంగంలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, కార్యాలయ వాతావరణం,పని తీరు తదితర అంశాలను విద్యార్థినులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఆదర్శ్ వర్ధన్ రాజు విద్యార్థినులకు సంస్థలో జరిగే కార్యకలాపాలు,ఉద్యోగుల పని విధానం,సంస్థ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల గురించి వివరించి,ఐటీ మరియు ఐటీఈఎస్ రంగాల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వాల్యూపిచ్ సంస్థ అడ్మిన్ సుధాకర్,నెట్‌వర్కింగ్ ఇంజినీర్ రామసాగర్, మహేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్ల రామన్న,పద్మజ,సుధాకర్, శ్రావతి,ఐటీఎస్ ఇన్‌చార్జ్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పారిశ్రామిక పర్యటన విద్యార్థినులకు ఐటీ రంగంపై ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తులో తమ కెరీర్‌ను ఎంచుకోవడానికి ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఖాదీ కాంప్లెక్స్‌లో వేధింపులు..

కుటుంబ జీవనాధారమైన మెడికల్ షాపును ఖాళీ చేయాలంటూ ఒత్తిడి!

అద్దె విషయంలో మోసం జరిగిందంటూ మెడికల్ షాపు యజమాని ఆరోపణ

ఖాదీ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని సంతోష్ విజ్ఞప్తి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం):- మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ కాంప్లెక్స్‌లో ఉన్న వేద మెడికల్ రూమ్ విషయంలో వివాదం నెలకొంది. ఈ మేరకు మెడికల్ షాపు యజమాని మరియాల సంతోష్ బుధవారం మాట్లాడుతూ తనకు జరిగిన ఇబ్బందులను వెల్లడించారు.సుమారు ఐదు సంవత్సరాల క్రితం ఖాదీ కాంప్లెక్స్‌లోని ఓ గదిని లీజుకు తీసుకుని మెడికల్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ గదికి నెలకు రూ.4 వేల అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకోగా, తమ వద్ద నుంచి మాత్రం రూ.12,700 అద్దె వసూలు చేస్తూ ఖాదీ కార్యాలయ అధికారులను మోసం చేసినట్లు ఆరోపించారు.ఇదిలా ఉండగా, ప్రస్తుతం గతంలో చెల్లించిన డిపాజిట్‌కు అదనంగా మరింత డిపాజిట్ డబ్బులు ఇవ్వాలని, లేనిపక్షంలో మెడికల్ షాపును ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని సంతోష్ ఆరోపించారు. గదిని ఖాళీ చేసి అప్పగించాలని బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మెడికల్ షాపే తమ కుటుంబానికి ప్రధాన జీవనాధారమని, దానిపైనే కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. తమ సమస్యను ఖాదీ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి, విచారణ జరిపి న్యాయం చేయాలని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

మల్లాపూర్, నవంబర్ 4 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణ, రాత్రి గస్తీ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా కలం
గురువారం, నవంబర్ 5, 2026

అల్పపీడనం నుంచి సూపర్ తుపాను వరకు?

మురసు.. అర్నబ్.. హుద్ హుద్.. తిత్లీ.. మొంథా.. ఒగ్ని.. ఈ పేర్లు వినే ఉంటారు కదా..!గత కొన్నేళ్లలో వచ్చిన తుపానుల పేర్లు ఇవి.వీటన్నింటికీ ఒక పోలిక ఉంది. అదేంటని అనుకుంటున్నారా?! ఇవన్నీ అక్టోబరు, నవంబరు నెలలో సంభవించాయి. ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపానులలో ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే ఉంటున్నాయని భారత వాతావరణ శాఖ చెబుతోంది.ఇంతకీ అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువగా తుపానులు ఏర్పడ్డానికి కారణమేమిటనే విషయంపై భారత వాతావరణ శాఖ, ఇన్ కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) ఈ తుపానులు ఏర్పడటంలో సముద్ర ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అని ఇన్ కాయిస్ శాస్త్రవేత్త బి.శివయ్య చెప్పారు.భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1891 నుంచి 2025 మధ్య బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 1261 ఏర్పడ్డాయి.వీటిల్లో ఎక్కువగా రెండు నెలల కాలంలో.. అంటే అక్టోబరు, నవంబరులోనే వచ్చాయి.అంతేకాదు, ఈ రెండు నెలల్లో వచ్చే తుపానుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. బంగాళాఖాతంలో 1891 నుంచి 2025 వరకు తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 541 వచ్చినట్లుగా భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇందులో అక్టోబరులో 96, నవంబరులో 126లో ఏర్పడ్డాయి.అలాగే 1891 నుంచి 2025 మధ్య తీవ్ర తుపానులు 247 ఏర్పడగా.. అక్టోబరులో 44, నవంబరులో 76 వచ్చాయి. తుపానుల విషయంలో సముద్ర ఉష్ణోగ్రతలలు, గాలుల గమనం తీరు కీలకంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల తిరోగమనం(పోస్ట్ మాన్ సూన్) తర్వాత తుపానులు ఎక్కువగా తూర్పు తీరం వైపున ఏర్పడుతుంటాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న చెప్పారు.”పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు అండమాన్ కింద నుంచి బంగాళాఖాతంలోకి వచ్చి చేరుతుంటాయి.రుతుపవనాల ముందు మయన్మార్ తీరంలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దానివల్ల అటువైపు తుపానులు వెళుతుంటాయి.కానీ, రుతుపవనాల తిరోగమనం తర్వాత బంగాళాఖాతంలో తూర్పు తీరంవైపు సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల తూర్పు తీరంవైపు తుపానుల గమనం ఉంటుంది. ఇందుకు గాలుల గమనం కూడా సహకరిస్తుంది '' అని చెప్పారు నాగరత్న.ఈ సమయంలో బంగాళాఖాతంలో సముద్రపు ఉష్ణోగ్రతలు సగటున 26.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటాయని వివరించారు.”సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు సీజన్లలో ఎక్కువగా రికార్డవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒకసారి? అక్టోబరు, నవంబరు సీజన్లలో మరోసారి ఎక్కువగా ఉంటాయి” అని బి.శివయ్య చెప్పారు.రుతుపవనాల తర్వాత శీతాకాలం వచ్చి సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడానికి కొంత ఆలస్యం అవుతుందని వివరించారు.ఈ పరిస్థితులతో అల్పపీడన ద్రోణి ఏర్పడటానికి వరిస్థితులు నహకరిస్తాయి'' అని చెప్పారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తీరం దాటడాన్ని గమనిస్తుంటాం.ఆంధ్రప్రదేశ్‌కు 1053.07 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరం ఉండగా, ఒడిశాకు 574.71 కిలోమీటర్ల పొడవైన తీరం ఉంది.తీరం పొడవు, తీరంలోని పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ వద్ద తుపానులు ఎక్కువగా తీరం దాటుతుంటాయని చెప్పారు నాగరత్న.”మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ వద్ద తీరంలో మలుపులు ఉంటాయి.గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలున్నాయి.తీరంలో ఉండే మలుపులు, సముద్రంలో నదులు కలిసే ప్రాంతాలు కూడా తుపానులను ఆకర్షించడానికి కారణమవుతాయి” అని వివరించారు.2026 అక్టోబరు.. అర్నబ్ అతి తీవ్ర తుపాను.. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురం సమీపంలో తీరం దాటింది. ఏపీపై పెను ప్రభావం చూపించింది.2026 నవంబరు.. మురసు తీవ్ర తుపాను.. ఇది ఆంధ్రప్రదేశ్ తీరంలోని నెల్లూరు సమీపంలో తీరం దాటింది.2014 అక్టోబరు.. హుద్ హుద్ తీవ్ర తుపాను.. ఏపీలో విశాఖపట్నంపై విరుచుకుపడింది.ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రికార్డుల ప్రకారం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పెను విధ్వంసం సృష్టించింది.ఇవేకాకుండా, ఏపీ చరిత్రలో అత్యంత తీవ్రమైన తుపానుగా కోస్తా తీర ప్రాంతవాసులు చెప్పుకొనే దివిసీమ తుపాను లేదా దివిసీమ ఉప్పెన కూడా 1977 నవంబరులోనే వచ్చింది.ఈ తుపాను కారణంగా 24 లక్షల మంది ప్రభావితం అయ్యారు. పదివేల మందికిపైగా చనిపోయారని అంచనా.1996 కాకినాడలో వచ్చిన తుపాను కూడా నవంబరు నెలలో సంభవించింది.2012లో కోస్తా జిల్లాలను కుదిపివేసిన నీలం తుపాను కూడా నవంబరులోనే సంభవించింది.సముద్రంలో ఏర్పడే అల్పపీడన ద్రోణి బలపడితే వాయుగుండగా మారుతుంది. వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండం.. ఆ తర్వాత తుపానుగా మారుతుంది.తుపానులలో గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుందని భారత వాతావరణ శాఖ చెబుతుంది.ప్రభావాన్ని బట్టి తుపాను లేదా తీవ్ర తుపాను లేదా అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ వర్గీకరిస్తుంది. గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుంది.గంటకు 31 కిలోమీటర్ల కంటే తక్కువగా గాలుల వేగం ఉంటే అల్పపీడన ద్రోణిగా పరిగణిస్తారు.గంటకు 31-49 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే వాయుగుండం, 50-61 కిలోమీటర్ల వేగం ఉంటే తీవ్ర వాయుగుండంగా పిలుస్తారు.గంటకు 62-88 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తుపాను, 89-117 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తీవ్ర తుపాను, 118-167 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ చెబుతుంది.అదే 168-221 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అత్యంత తీవ్రమైన తుపాను, 222 కిలోమీటర్లకు పైబడి గాలులు వస్తే సూపర్ తుపానుగా చెబుతారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి

మంత్రి చొరవ చూపాలి

ఆరోగ్య ఉపకేంద్రం, రహదారి నిర్మాణానికి నిధులు

మంజూరు చేయాలి.. అర్హులకు ఇళ్ల స్థలాలు చూపించి పట్టాలు అందించాలి

12 నెలలుగా ప్రారంభానికి నోచుకోని గ్రామ పంచాయతీ భవనం



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం):

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపాలని గ్రామానికి చెందిన జక్కని పరంధామం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించి గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం లేకపోవడంతో ప్రజలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర సమయాల్లో వైద్యం అందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామానికి అవసరమైన రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లలేని నిరుపేద కుటుంబాలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. గతంలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారులకు స్థలాలు చూపించలేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని అర్హులైన లబ్ధిదారులకు స్థలాలు చూపించి ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. మరోవైపు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తయి సుమారు 12 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండటం విచారకరమని, వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజల కనీస అవసరాల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా అధికారులు స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జక్కని పరంధామం విజ్ఞప్తి చేశారు.

గాలికొదిలిన సమస్యలు..

గాలిమోటార్లలో చక్కర్లు

సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజా సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలిమోటార్లలో ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు.పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద గత 23 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కలిసి ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు,గర్భిణులకు కీలక వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు.ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిలో 90 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ ప్రసూతి సెలవులు, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమని మండిపడ్డారు.అధికారంలోకి రాకముందు హామీలిచ్చిన కాంగ్రెస్,ఇప్పుడు సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయట్లేదని ఆరోపించారు.హెలికాప్టర్లు,ఢిల్లీ పర్యటనలకు ప్రజాధనం ఖర్చు చేయడం ఆపి,ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తక్షణమే ఉద్యోగ భద్రత, వేతన పెంపు,వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

తెలంగాణ రక్షణ సేన బీసీ సెల్ జిల్లా నూతన కమిటీల నియామకం

పాంచజన్యాలు,భూలక్ష్మి విధానాలను గడపగడపకూ చేర్చాలి

జిల్లా అధ్యక్షురాలు సిరవేణి స్వప్ననియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్ నియామకం





పెద్దపల్లి,నవంబర్ 04 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

క్షేత్రస్థాయిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడంతో పాటు బడుగు,బలహీన వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పార్టీ బీసీ సెల్ కమిటీలను నియమించాం అని తెలంగాణ రక్షణ సేన పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు సిరవేణి స్వప్ననియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య స్పష్టం చేశారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా,నియోజకవర్గ మరియు మండల స్థాయి నూతన కమిటీలను స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య అధికారికంగా ప్రకటించారు.క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే సమర్థులైన నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు వారు వెల్లడించారు.ఈ నియామకాల్లో భాగంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్,జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా భోగాని శంకర్ గౌడ్,పెద్దపల్లి నియోజకవర్గ స్పోర్ట్స్ వింగ్ అధ్యక్షురాలిగా దాడి స్రవంతి బాధ్యతలు స్వీకరించారు.మండల స్థాయి కమిటీల్లో భాగంగా పెద్దపల్లి రూరల్ అధ్యక్షుడిగా ఉప్పు ఘట్టేష్,ప్రధాన కార్యదర్శిగా ఎంచెర్ల స్వామి నియమితులు కాగా,సుల్తానాబాద్ రూరల్ అధ్యక్షుడిగా మల్యాల కరుణాకర్,ప్రధాన కార్యదర్శిగా పోసాని కృష్ణలకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్ననియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య మాట్లాడుతూ వెనుకబడిన,బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నూతన కమిటీల ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంకల్పించిన పాంచజన్యాలైన నాణ్యమైన ఉచిత విద్య,వైద్యం,ఆరోగ్యం, సామాజిక న్యాయం వంటి ఐదు కీలక అంశాలతో పాటు,భూమి లేని నిరుపేదలకు,నిర్వాసితులకు అండగా నిలిచే ప్రతిష్టాత్మక భూలక్ష్మి-ఎకరం భూమి విధానాన్ని గ్రామగ్రామాన ప్రతి గడపకూ చేరవేసే బాధ్యతను కార్యకర్తలు భుజానకెత్తుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు గడువు పొడిగింపు కోసం పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్వయంగా ఎన్నికల సంఘాన్ని కలిసి పోరాడారని,ఆమె విజ్ఞప్తికి స్పందించి గడువు పెంచినందుకు ఎన్నికల కమిషన్‌కు పెద్దపల్లి జిల్లా కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.నూతనంగా ఏర్పాటైన పార్టీ ఎజెండాను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి విద్యార్థి, పట్టభద్రుడు వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకునేలా నాయకులు క్షేత్రస్థాయిలో సహకరించాలని కోరారు.రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని నాయకులు స్పష్టం చేశారు.తమపై సంపూర్ణ విశ్వాసంతో గురుతర బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు నూతన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్,కమిటీల బాధ్యులు కృతజ్ఞతలు తెలుపగా,కొత్తగా ఎన్నికైన వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా నేత రవీందర్ రావు కు పరామర్శ



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 04(ప్రజా కలం): అనారోగ్యంతో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేన్నేని రవీందర్ రావు ను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు పరామర్శించారు. బుధవారం వారు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రవీందర్ రావు ఆరోగ్య సమస్యలతో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించిన వారిలో ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు కాసం శ్రీనివాస్ రెడ్డి, రాగం రమేశ్, సహాయ కార్యదర్శి అనంతుల కాంతారావు, కోశాధికారి మేన్నేని శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యుడు గోపాటి నరేందర్ రావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జయపాల్, నాయకులు తిరునగరి శ్రీనివాస్, ఎం. నర్సయ్య తదితరులున్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీఎస్‌యూటీఎఫ్

జగిత్యాల్ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాకలం)జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవేల శ్యాంసుందర్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాలను 010 పద్దు కింద మంజూరు చేయాలని, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌తో పాటు డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, జీఓ 317ను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ వేముల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నిసాని మహేందర్, ప్రధాన కార్యదర్శి కొత్తూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి చేతుల మీదుగా పైథాన్ మేడ్ ఈజీ పుస్తకావిష్కరణ



ఎండపల్లి, నవంబర్ 04 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయ ఆవరణ లో మండల తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ కుమారుడు ఎడ్ల విశ్వేశ్ వయసు (15) సంవత్సరాలు ఇంటర్ సెకండియర్ చదువుతూ పైథాన్ మేడ్ ఈజీ ఒక ప్రాథమిక గైడ్ అనే ప్రోగ్రాం పుస్తక రూపంలో తయారుచేసిన పుస్తకాన్ని బుధవారం రోజున మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎడ్ల విశ్వేశ్ ను శాలువాతో సన్మానించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఇంత చిన్న వయసు లో పైథాన్ మేడ్ ఈజీ బేసిక్ ప్రోగ్రాం, ఒక యాప్ ను కూడా తయారు చేయడం గర్వించదగ్గ విషయమని విశ్వేశకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా నేను ముందు ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో తాహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎంపీడీవో దొండ కృపాకర్, సర్పంచ్ మారం సునీత జలంధర్ రెడ్డి, ఎండపల్లి వెల్గటూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, తాటిపర్తి శైలేందర్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు కార్యదర్శులు, పాత్రి కేయులు, ఎడ్ల విశ్వేశ్ ను పలువురు అభినందించారు.

భర్త తాగుడు వ్యసనానికి వివాహిత బలి

పెద్దపల్లి, నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) భర్త మద్యానికి బానిసయ్యాడనే మనస్తాపంతో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పెద్దపల్లి పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.ఎస్సై వెల్లడించిన వివరాల ప్రకారం..



పట్టణంలోని సాగర్ రోడ్ నివాసి అయిన సఫియా కుమార్తె అసిఫా అంజూమ్ (24)కు ఆరేళ్ల క్రితం గూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ ఎండీ అఫ్రోజ్‌తో వివాహం జరిగిందని,వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు.అయితే గత కొంతకాలంగా అఫ్రోజ్ సంపాదననంతా మద్యానికే ఖర్చు చేస్తూ తాగుడుకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి.నెల క్రితం జరిగిన గొడవ అనంతరం అసిఫా పిల్లలను భర్త వద్దే వదిలి పుట్టింటికి వచ్చిందని,అనంతరం ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడి ఈ నెల 4న ఆమెను అత్తగారింటికి పంపించేందుకు నిర్ణయించారని తెలిపారు.భర్త తాగుడు వ్యసనం మానడనే బాధను మనసులో పెట్టుకున్న అసిఫా,మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్షణికావేశంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతురాలి తల్లి సఫియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఓనమాలు దిద్దిన బడిపై మమకారం

- అప్పన్నపేట పాఠశాలకు ఎమ్మెల్సీ కొమరయ్య 50 బెంచీల వితరణ



పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తాను ఓనమాలు దిద్దిన బడి రుణం తీర్చుకునేందుకు ఓ ప్రజాప్రతినిధి ముందుకొచ్చారు.పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు,ఎమ్మెల్సీ మల్క కొమరయ్య 50 సరికొత్త డెస్క్ బెంచీలను వితరణగా అందజేశారు.తరగతి గదుల్లో సరైన కూర్చునే వసతి లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి ఈ సాయం అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కొమరయ్య తన పాఠశాల నాటి జ్ఞాపకాలను భావోద్వేగంతో పంచుకున్నారు.నేను పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్నాను.ఆ రోజుల్లో బంధంపల్లి నుంచి రోజూ ఐదు కిలోమీటర్లు కాలినడకనే వచ్చి విద్యాభ్యాసం చేశా.నా ఎదుగుదలకు పునాది వేసిన ఈ పాఠశాల అభివృద్ధికి చేతనైన సాయం చేయడం నా బాధ్యత అని పేర్కొన్నారు.గతంలో కూడా పాఠశాలకు ఆర్చ్,ప్రధాన గేటును సమకూర్చిన విషయాన్ని గుర్తుచేశారు.విద్యార్థుల అవసరాన్ని గుర్తించి బెంచీలు అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,గ్రామ పెద్దలు ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకు,ఎంకే ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ వంశీకృష్ణకు ప్రోటోకాల్ ఉల్లంఘన

- అధికారులపై ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దసరా ఉత్సవాల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం దక్కాల్సిన గౌరవం దక్కకపోవడం జిల్లాలో అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అధికారిక కార్యక్రమాలకు ప్రజాప్రతినిధిని ఆహ్వానించకుండా నిబంధనలను కాలరాసిన అధికారుల తీరుపై ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పర్స విజయ్‌కుమార్ జాతీయ కమిషన్‌ను ఫిర్యాదు చేశారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్,పెద్దపల్లి మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఎంపీని ఉద్దేశపూర్వకంగా విస్మరించిన బాధ్యులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంకింద కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో కాళేశ్వరం పుష్కరాల సమయం లోనూ ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ,మళ్లీ అదే తరహాలో నిర్లక్ష్యం ప్రదర్శించడంఎంతమాత్రం సరికాదన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాగతంగాకఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు




పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పిలుపునిచ్చారు.బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుద్దాల సింగిల్ విండో ఆధ్వర్యంలో సుద్దాల,అల్లిపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,సింగిల్ విండో చైర్మన్లు అనేడి భాస్కర్ రెడ్డి,చిలుక సతీష్,సర్పంచులు ఒజ్జా సంపత్ యాదవ్,కోదాటి సాయి కిరణ్, అనంత రెడ్డి,దామోదర్ రావు,రాజిరెడ్డి, మోహన్ రెడ్డి,సంపత్,సొసైటీ సీఈవో సతీష్, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు

చిన్నారి నేహాను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కేవీ

తల్లాడ నవంబర్ 4 ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన వినుకొండ దొర్నేశ్, ఏలమ్మా దంపతుల మనవరాలు (బాబు, కారుణ్య దంపతుల కుమార్తె) స్నేహ ఓనీల అలంకరణ వేడుక బుధవారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) హాజరై ఆ చిన్నారికి అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, మళ్లీడి వెంకటేశ్వరావు, ఇస్నపల్లి శ్రీనివాసరావు, కందుల నారాయణ తదితరులు ఉన్నారు.



పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

నవంబర్ 29, 2026లోగా పెండింగ్ బియ్యం సరఫరా పూర్తి చేసేందుకు మిల్లుల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

30 ఏసికే ల కంటే తక్కువ పెండింగ్ ఉన్న 20 మిల్లులు రోజుకు కనీసం ఒక ఏసికే సరఫరా చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

30 ఏసికే పైగా పెండింగ్ ఉన్న మిల్లులు రోజుకు 2 నుంచి 3 ఏసికే ల చొప్పున సరఫరా చేయాలి

పెండింగ్ బియ్యం సరఫరాలో సమస్యలుంటే అధికారుల సహకారం తీసుకోవాలి - నవంబర్ 30 నాటికి సరఫరా చేయని మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా పరిగణిస్తాం

పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 04 (ప్రజా కలం)

రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారితో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న అక్ల వివరాలు, బియ్యం సరఫరా పురోగతి,గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇంకా 2,564 ఏసికే ల సీఎంఆర్ డెలివరీ పెండింగ్‌లో ఉందని తెలిపారు. పెండింగ్ బియ్యం సరఫరాకు ప్రభుత్వం నవంబర్ 29, 2026 వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న 24 రోజుల వ్యవధిలో పెండింగ్ బియ్యం సరఫరా పూర్తి చేసేలా ప్రతి మిల్లు తమకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

మిల్లుల వారీగా రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

30 ఏసికే ల కంటే తక్కువ పెండింగ్ ఉన్న 20 మిల్లుల్లో పెద్దగా సమస్యలు లేవని, ఆయా మిల్లులు రోజుకు కనీసం ఒక ఏసికే చొప్పున బియ్యం సరఫరా చేసినా పెండింగ్ లక్ష్యాలను పూర్తి చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆయా మిల్లులు ఎలాంటి జాప్యం చేయకుండా రోజువారీ సరఫరా చేపట్టి పెండింగ్‌ను పూర్తిగా క్లియర్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 30 ఏసికే లకు పైగా పెండింగ్ ఉన్న మిల్లులు రోజుకు కనీసం 2 నుంచి 3 ఏసికే చొప్పున బియ్యం సరఫరా చేసేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆ స్థాయిలో సరఫరా చేయడం కొంత కష్టంగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సరఫరా వేగాన్ని పెంచాలని స్పష్టం చేశారు. పెండింగ్ బకాయిల పరిష్కారానికి సహకారం దిచ్‌పల్లి పరిధిలోని 12 మిల్లులతో పాటు ఇతర మిల్లులకు పెండింగ్ బియ్యం సరఫరా, సంబంధిత బకాయిల క్లియరెన్స్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మిల్లుల సమస్యలను పరిశీలించి, పెండింగ్ బకాయిల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి రైస్ మిల్లర్ సీఎంఆర్ బియ్యం సరఫరాను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, గడువులోగా పెండింగ్ మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ప్రతి మిల్లర్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నవంబర్ 29, 2026లోగా పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరా పూర్తి చేయాలని, నవంబర్ 30 నాటికి కూడా బియ్యం సరఫరా చేయని మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. గడువు పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని మిల్లర్లు తమ పెండింగ్ బియ్యం సరఫరా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఎస్పీ జితేందర్ రెడ్డి, డిఏం సివిల్ సప్లై జితేంద్ర ప్రసాద్, రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసు నిందితుల అరెస్ట్

చోరీ సొత్తుతో పాటు బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం

నిందితుల్లో ఇద్దరు మైనర్లు - వివరాలు వెల్లడించిన సిఐ రాజ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 4(ప్రజా కలం)

మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను కొడిమ్యాల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్యాల సీఐ రాజ్‌కుమార్ వెల్లడించారు. వారి కథనం ప్రకారం నవంబర్ 3న గంగారం తండాకు చెందిన అజ్మీర దూరి (50) ఉదయం 9 గంటల సమయంలో సూరంపేట గ్రామ శివారులోని ఐకేపీ కేంద్రానికి వడ్లు ఆరబెట్టేందుకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 4న నాచుపల్లి ఇటుక బట్టీల సమీపంలో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లు తేలింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీకి గురైన బంగారు పుస్తెలతాడుతో పాటు నేరానికి ఉపయోగించిన హెచ్ఎఫ్ డీలక్స్ బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఉపయోగించిన బైక్ జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిప్పన్నపేట గ్రామంలో చోరీకి గురైన వాహనంగా గుర్తించారు.అనంతరం ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కోరుట్లకు చెందిన గణేష్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మైనర్లు కావడంతో వారి వివరాలను గోప్యంగా ఉంచామన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి.. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె



నాగర్‌కర్నూల్ నవంబర్ 04 (ప్రజా కలం): ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పీపీ యూనిట్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సృజనకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పొదిల రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులకు వైద్య సేవలు అందించడం, తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడటం, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ ఆశా కార్యకర్తలు విశేష సేవలందించారని గుర్తుచేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సబ్‌సెంటర్ విధులు, ఏఎన్‌సీ, పీఎన్‌సీ సేవలు, ఎన్‌సీడీ ఆన్‌లైన్ సర్వేలు, పల్స్ పోలియో, లెప్రసీ, డ్రైడే తదితర అనేక పనులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి కనీస ఫిక్స్‌డ్ వేతనం లేదన్నారు. ప్రస్తుతం కేవలం రూ.9,900 పారితోషికం మాత్రమే అందుతోందని, గత మూడేళ్లుగా పారితోషికాలు పెంచకపోవడంతో పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు ఆశా వర్కర్లు 15 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించారని గుర్తుచేశారు. అప్పట్లో ఆశాల సమస్యల పరిష్కారానికి ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన చర్చల్లో రూ.50 లక్షల బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవుల మంజూరుకు సంబంధించి హామీలు ఇచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అవి అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏనుపోతుల కాశన్న, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు అమీనా, జయశ్రీ, రాధ, కృష్ణవేణి, శిరీష, శ్రీదేవి, భాగ్యమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలపై 'మత్తు' వల

రాఘవపూర్ శివారులో గంజాయి కేటుగాడి అరెస్ట్

1 కిలో 161 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం

పెద్దపల్లి రూరల్ ఎస్సై నాయిని మధుకర్



పెద్దపల్లి,నవంబర్ 04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామ శివారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న అంతర్ జిల్లా నిందితుడిని పోలీసులు పక్కా సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.బుధవారం రాఘవపూర్ సమీపంలోని ఎల్ఎమ్ఎన్ బ్రిక్స్ వద్ద ఓ అపరిచిత వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సంచరిస్తుండటాన్ని గమనించిన పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.విచారణలో నిందితుడు హైదరాబాద్‌కు చెందిన పాకాల లోకేష్‌గా గుర్తించామని,పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలు,నిర్మాణ రంగాల్లో పనులు చేస్తున్న ఇతర రాష్ట్రాల వలస కూలీలను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయించేందుకు ఇక్కడికి తీసుకువచ్చినట్లు నిర్ధారణ అయిందని పెద్దపల్లి రూరల్ ఎస్సై నాయిని మధుకర్ తెలిపారు.నిందితుడి వద్ద నుంచి రూ.58 వేల విలువ చేసే 1కిలో 161 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని తెలిపారు.ఈ వ్యవహారంలో గంజాయి సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై సమగ్ర విచారణ జరుపుతూ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని రూరల్ ఎస్సై మధుకర్ వెల్లడించారు.

గొల్లగూడేన్ని ముంచెత్తిన మురసు తుఫాన్

వరద దాటికి వరిపంట నేలమట్టం..

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.. రైతు కోడూరు వీరకృష్ణ..



తల్లాడ నవంబర్ 4 ప్రజా కలం న్యూస్ : ఖమ్మంజిల్లా తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో మురసు తుఫాన్ ప్రభావానికి వరిపంట నేలమట్టం అయింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంట ఒక్కసారిగా నేలను తాకింది. గ్రామంలోని చెరువుల కింద రైతులు వరి పంటలను సాగు చేశారు. మరో వారం, పది రోజుల్లో కోతదశలో ఉండగా ఒక్కసారిగా తుఫాన్ రావడంతో రైతుల ఆశలపై కన్నీళ్లు చల్లింది.




5 ఎకరాలు సాగుచేశాను,మొలకలు వచ్చాయి. రైతు కోడూరు వీర కృష్ణ..

తనకున్న 3 ఎకరాల పొలంతో పాటు 2 ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాను. వారం రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న సమయంలో మురుసు తుఫాను కారణంగా పంట మొత్తం నేలమట్టం అయింది. ఒకొక్క ఎకరానికి 50 వేల వరకు పెట్టుబడులు పెట్టాను. మొత్తం ఐదు ఎకరాలకు గాను రెండున్నర లక్షలు పెట్టుబడి పెట్టాను. వరద పంటపై పోవటంతో కంకులు నీళ్లలో ఉండి మొలకలు వచ్చిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. గ్రామానికి చెందిన విలాసాగరం శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కొరకొప్పు లక్ష్మయ్య, నరసింహారావు, అమర్తయ్య, బొగ్గుల పుల్లారెడ్డి, కోడూరు వెంకటయ్య, కొండలరావు, వెంకటయ్య తదితర రైతుల పొలాలు వరద తాకిటికి నేలమట్టం అయ్యాయి.

రోజానమ్మ చిత్రపటానికి పూలమాల వేసి

నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



తల్లాడ, నవంబర్ 4 ప్రజా కలం న్యూస్ తల్లాడ నారాయణపురం నివాసి,యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు న్యాయమూర్తి అంగిడి జయరాజు మాతృమూర్తి అంగిడి రోజానమ్మ ఇటీవల మృతి చెందారు. నారాయణపురంలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆమె దశదిన కర్మ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రోజానమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వర రావు (బి వి ఆర్), మర్సకట్ల బాబు రావు,ఖమ్మం జిల్లా కోర్టు అడ్వకేట్ తొండపు వెంకటేశ్వర్లు, గొడుగునూరు శ్రీనివాసరెడ్డి,సీతారామరెడ్డి, ముకర ప్రసాద్, వెంకట నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మల్లవరం సీఎంఆర్ చెక్కుల పంపిణీలో సర్పంచ్ కటికి కిరణ్ కుమార్



తల్లాడ. నవంబర్. 4 ప్రజా కలం న్యూస్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మల్లవరం సర్పంచ్ కటికి కిరణకుమార్ అన్నారు. బుధవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామపంచాయతీలో సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు సన్న బియ్యంతో పాటు ఆసుపత్రిలో పేదలకు లక్షల్లో వైద్య రంగానికి నిధుల సమకూర్చడం జరిగిందన్నారు త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటుకు దరఖాస్తు చేసుకొని కాంగ్రెస్ అభ్యర్థిగా రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, పల్లడం వల్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, తల్లాడ మండలం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుండేటి వీరారెడ్డి,ఉపసర్పంచ్ గుర్రం యశోద యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దుగ్గిదేవర రవీంద్ర గ్రామ పార్టీ అధ్యక్షులు సీతారామయ్య మాజీ సర్పంచ్ మేడి సీతారాములు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట కృష్ణయ్య తోట మురళి. తదితరులు పాల్గొన్నారు

మొగిలి లో పాలంబాట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్



తానూర్, నవంబర్ 04(ప్రజా కలం): మండలంలోని మొగిలి గ్రామంలో బుధవారం వివిజీ రామ్ జీ పథకంలో భాగంగా పాలంబాట రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ఉషా – దర్శన్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు,గ్రామీణ ప్రాంతాల్లో రైతుల రవాణా కష్టాలను తీర్చడానికి రోడ్ల అభివృద్ధి ఎంతగానో తోడ్పడుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ అన్నారు,ఈ కార్యక్రమంలో ఏఫ్ఏ మానిక్, నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శి , రైతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక

వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుని పండ్ల పంపిణీ

నాగర్‌కర్నూల్, నవంబర్ 04 (ప్రజాకలం) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బిజినపల్లి మండలంలోని లూర్దునగర్‌లో ఉన్న ప్రశాంత నిలయం వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక సందర్శించారు.ఈ సందర్భంగా వృద్ధులతో ఆమె ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో వారికి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వృద్ధులతో పాటలు పాడించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. జీవితంలో వృద్ధాప్య దశ ఎంతో ముఖ్యమైనదని, ఈ దశలో ప్రతి ఒక్కరూ ఆహ్లాదకరంగా, సంతోషంగా జీవించాలని ఆమె సూచించారు.వృద్ధులకు ఏవైనా సమస్యలు లేదా సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య, ప్రశాంత నిలయం ఆశ్రమ నిర్వాహకురాలు సిస్టర్ రవికుమారి, వృద్ధులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌పై

ఉద్యోగులకు మూడు రోజుల శిక్షణ

- జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల.



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 04:

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, ఉద్యోగుల పనితీరు సామర్థ్యం పెంపొందించడంతో పాటు పేపర్‌లెస్ పాలనను ప్రోత్సహించేందుకు ఉద్యోగులకు డిజిటల్ విధానాలపై శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌లో భాగంగా నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ప్రారంభించారు.ఈ శిక్షణలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు eHRMS, E SANCTIONS WAMIS, ఐఎఫ్ఎంఐఎస్ తదితర డిజిటల్ మాడ్యూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ డిజిటల్ వ్యవస్థలోకి తీసుకువచ్చి పేపర్‌లెస్ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఉద్యోగులందరికీ డిజిటల్ విధానాలపై శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిజిటల్ వ్యవస్థ ద్వారా ఉద్యోగుల పనితీరు సామర్థ్యం పెరగడంతో పాటు పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మెరుగుపడతాయని అన్నారు.గతంలో కార్యాలయాల్లో ఒకరి నుంచి మరొకరికి ఫైళ్లను కాగితాల రూపంలో పంపించాల్సి వచ్చేదని, ప్రస్తుతం డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగులు తమ స్థానాల్లోనే ఉండి ఫైళ్లను ఒకరి నుంచి మరొకరికి ఆన్‌లైన్‌లో పంపించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. దరఖాస్తులు, ఫైళ్ల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. నవంబర్ 15 నుండి అన్ని ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ విధానం అమలు కానుందని తెలిపారుప్రతి ప్రభుత్వ శాఖకు సంబంధించిన విధులు, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక డిజిటల్ మాడ్యూల్స్ రూపొందించినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖలో పంచనామాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలకు సంబంధించిన కార్యకలాపాలు, ఇంజినీరింగ్ శాఖలో ఆ శాఖకు సంబంధించిన పనులు ,అని ప్రభుత్వ శాఖల పరిధిలోనే డిజిటల్ విధానంలో నిర్వహించుకునేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఉద్యోగులందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని డిజిటల్ విధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి,జిల్లా ట్రెజరీ అధికారి బి.శ్రీనివాస్,పి. ఏ .ఓ .వి.ఎస్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం బాసరలోని ఆలయ ఈవో కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లు, సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుష్కర ఘాట్ల మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిండ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, భక్తుల పార్కింగ్, వీఐపీ పార్కింగ్ తదితర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పుష్కరాలకు వచ్చే ప్రముఖుల వసతికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పుష్కరాల ఏర్పాట్లు,ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్‌బీ ఈఈ సుభాష్,ఉద్యానవన శాఖ అధికారిరమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రతి బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి

బీపీటీ, కేఎన్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రూ.79 - నిబంధనలు ఉల్లంఘిస్తే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తాం

బియ్యం ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, నవంబర్ 04(ప్రజా కలం న్యూస్)

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి మరో కీలక బాధ్యత

జాతీయ దంత వైద్య విద్యా బోర్డు పార్ట్‌టైమ్ సభ్యుడిగా నియామకం



నాగర్‌కర్నూల్ నవంబర్ 04 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డికి జాతీయ స్థాయిలో మరో కీలక బాధ్యత లభించింది. జాతీయ దంత వైద్య కమిషన్ పరిధిలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ ఎడ్యుకేషన్ బోర్డు పార్ట్‌టైమ్ సభ్యుడిగా ఆయన నియమితులయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రెండేళ్ల పదవీకాలానికి ఈ నియామకం చేపట్టింది.ఇప్పటికే జాతీయ దంత వైద్య కమిషన్ సభ్యుడిగా కొనసాగుతున్న డాక్టర్ రాజేష్ రెడ్డికి తాజాగా మరో కీలక బాధ్యత అప్పగించడం విశేషం. తెలంగాణ డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా ఆయన దంత వైద్య విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయిలో ఈ అవకాశం దక్కినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ బాధ్యతల ద్వారా దంత వైద్య విద్యకు సంబంధించిన పాఠ్యప్రణాళిక రూపకల్పన, విద్యా విధానాల అభివృద్ధి, దేశవ్యాప్తంగా దంత వైద్య విద్యా ప్రమాణాల మెరుగుదలలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి డాక్టర్ రాజేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో, సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేకు జాతీయ స్థాయిలో మరో కీలక పదవి లభించడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

రైతు మేళాకు రైతుల తరలింపునకు పక్కా ఏర్పాట్లు

మండలాల వారీగా ప్రత్యేక ప్రణాళిక..

రవాణా, భోజన సదుపాయాల కల్పన :కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్ నవంబర్ 04 (ప్రజా కలం): ఈ నెల 9వ తేదీన హకీంపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళాకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో రైతులను తరలించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి రైతులను తరలించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. రైతుల రవాణా కోసం అవసరమైన బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. బస్సుల వివరాలు, రైతులను ఎక్కించుకునే పికప్ పాయింట్లు, బయలుదేరే సమయాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు తమ గమ్యస్థానానికి చేరుకునే వరకు ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
రైతు మేళాలో జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ముందస్తు చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పరిశీలన



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 04:జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన సమయంలో కొన్ని వార్డులకు తాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతు పనులను ఆయన మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. అలాగే బోరుబావుల పునరుద్ధరణ, పాత తాగునీటి వనరులను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుఫానుతో దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన

రైతులకు వ్యవసాయ అధికారి సూచనలు!

పెరిక సింగారంలో పంటలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి

పాలేరు నవంబర్ 04(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోని బుధవారం పెరిక సింగారం గ్రామంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించి పరిశీలించారు.



ఈ సందర్భంగా పంట నష్టంపై రైతులతో మాట్లాడి, పంటలను కాపాడుకునేందుకు పలు సూచనలు చేశారు. పొలాల్లో పడిపోయిన వరి పైరులో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించాలని, పడిపోయిన వరి పనలను నిలబెట్టి కట్టుకోవాలని సూచించారు. గింజలు పూర్తిగా తయారై నీటిలో మునిగి ఉంటే మొలకెత్తే అవకాశం ఉందని తెలిపారు. దీనిని నివారించేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.అలాగే వర్షం తగ్గిన వెంటనే వరి పైరుపై ప్రొపికోనజోల్ మందును పిచికారీ చేయడం ద్వారా కాటుక తెగులు వ్యాప్తిని నివారించవచ్చని వివరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నవీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవాబు పేట మండలం పోమాల్, తిమ్మాయపల్లి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజాకలం ప్రతినిధి నవంబర్ 04:

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం నవాబ్‌పేట మండలంలోని పోమాల్, తిమ్మాయపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి పారిశుధ్య పనులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పోమాల్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడి పారిశుధ్య నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిశుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. రెండో తరగతి గదిలో విద్యార్థులకు బోర్డుపై రాసిన తెలుగు అక్షరాలు, పదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థినికి బోర్డుపై రాసిన అక్షరాలు సరిగా కనిపించకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్, వెంటనే కంటి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ద్వారా పరీక్షలు చేయించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.గ్రామంలో నీటి సరఫరా పైపులైన్‌లో లీకేజీని గుర్తించిన కలెక్టర్, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను వెంటనే అరికట్టి నీటి వృథాను నివారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో లేకపోవడాన్ని గమనించి అవసరమైన మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపకేంద్రానికి వచ్చిన రోగులు, గర్భిణులతో మాట్లాడి వైద్య సేవలు, మందుల లభ్యత, టీకాల కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ఉపకేంద్రం పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయని సిబ్బంది వివరించగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, పోమాల్ గ్రామం గడ్డ కాలనీ లో మూడేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగంతో ఫోన్‌లో మాట్లాడి భవనం ప్రారంభానికి నోచుకోకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు వెంటనే చేపట్టి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. తదుపరి తిమ్మాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. కేంద్రానికి హాజరవుతున్న పిల్లల సంఖ్య, గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు చిన్నారుల బరువును స్వయంగా పరిశీలించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. పప్పులు, ఆకుకూరలు, గుడ్లు తదితర పోషకాహార పదార్థాల సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలపడంతో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కారణాలను తెలుసుకున్నారు. పోషకాహార సరఫరాలో అంతరాయం లేకుండా సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, జి.పి.ఓ రమేష్, వార్డు సభ్యులు సుమలత, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

పున్నెలు క్రాస్‌లో ఘనంగా 'ఆహార' ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

యువ పారిశ్రామికవేత్తలను అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు



నవంబర్ 4 ఐనవోలు:– (ప్రజాకలం ప్రతినిధి)

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నెలు క్రాస్ వద్ద ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆహార' ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఐనవోలు మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్ నేతృత్వంలో నలుగురు యువకులు కలిసి ఈ వ్యాపార సంస్థను ప్రారంభించడం విశేషం. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొంటూ, వారి వ్యాపార ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

యువత స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయడం సమాజానికి స్ఫూర్తిదాయకమని, నూతనంగా ప్రారంభించిన ఆహార ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రజల ఆదరణ పొందుతూ వ్యాపార రంగంలో మంచి గుర్తింపు సాధించాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్, అయినవోలు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శంకర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధుచంద్ర గౌడ్ తదితరులు హాజరై యువ పారిశ్రామికవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆపదలో ఆదుకున్న చిన్ననాటి స్నేహితులు

- అకాల మరణం చెందిన మూశం సారంగపాణి కుటుంబానికి రూ.57 వేల ఆర్థిక సాయం

వరంగల్, నవంబర్ 04 (ప్రజాకలం ప్రతినిధి):

ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి చిన్ననాటి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మూశం సారంగపాణి ఇటీవల అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబం కష్టాల్లో పడింది. ఈ నేపథ్యంలో సారంగపాణి చిన్ననాటి మిత్రులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు.

ఈ మేరకు మిత్రులందరూ కలిసి రూ. 57,000 విరాళాలను సేకరించి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు చేతుల మీదుగా సారంగపాణి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బేతి అశోక్ బాబు మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి మిత్రుల సేవాభావాన్ని అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మనకు చేతనైన సహాయం అందించడం గొప్ప మానవతా విలువ అని పేర్కొన్నారు. స్నేహం అంటే కేవలం నంతోషాల్లో



కలిసుండటమే కాకుండా, కష్టకాలంలోనూ తోడుగా నిలవడమేనని ఈ మిత్రులు తమ సేవా దృక్పథంతో మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమంలో లయన్ పోషల సురేందర్, దండు దయాసాగర్, రామ, రమేష్, మహేందర్, యుగేందర్, వెంకన్న, కృష్ణ, జగన్, గోరంట్ల మనోహర్, మంతెన అమ్రేష్ తదితర చిన్ననాటి మిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి సమరశంఖం

తెలంగాణ ఉద్యమ సైనికులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు ఎప్పుడు?

జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే ప్రత్యేక కార్యాచరణ.. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి..

సంగారెడ్డి జిల్లా శాఖకు రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక అభినందనలు..





పటాన్‌చెరు, నవంబర్ 4 (ప్రజా కలం) ప్రతినిధి తెలంగాణ ఉద్యమంలో కలాన్ని ఆయుధంగా మలచి, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిన పాత్రికేయులు నేడు తమ సంక్షేమం కోసం ప్రభుత్వాల వైపు చూడాల్సిన పరిస్థితి ఉందని టీయూడబ్ల్యూజే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. బుధవారం ఆర్‌సి పురంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా శాఖ తరఫున నివేదికను సమర్పిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు..

ప్రజల కోసం కలం పట్టిన వారు.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచి ప్రజల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేశారని యాదగిరి గుర్తుచేశారు. ప్రజల కష్టాలను వెలుగులోకి తెచ్చి, వారి తరఫున గళమెత్తిన జర్నలిస్టులు నేడు కూడా అదే బాధ్యతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాంటి వారి సంక్షేమాన్ని విస్మరించడం తగదని స్పష్టం చేశారు..

ఏడు దశాబ్దాల పోరాట వారసత్వం..

ఏడు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల పక్షాన నిలుస్తున్న సంఘంగా, గ్రామీణ జర్నలిస్టుల హృదయాల్లో టీయూడబ్ల్యూజేకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ పరంపరను కొనసాగిస్తూ ఇటీవల సంగారెడ్డి, నారాయణఖేడ్, కంగ్టి, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. సంగారెడ్డిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నామని చెప్పారు..

ఇంటి స్థలాల కోసం ప్రత్యేక కార్యాచరణ..

జిల్లాలో జర్నలిస్టులకు ఇంటి స్థలాల సాధనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని యాదగిరి వివరించారు. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఈ అంశంపై ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం దక్కేవరకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు..

హెల్త్ కార్డులపై గట్టి డిమాండ్.

గతంలో జిల్లా మహాసభల సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు హెల్త్ కార్డుల విషయంలో గట్టిగా విజ్ఞప్తి చేశామని ఆయన గుర్తుచేశారు. జిల్లా మంత్రిగా ఉన్న రాజనరసింహను వివిధ సందర్భాల్లో కలిసినప్పుడల్లా ఈ అంశాన్ని ప్రస్తావించామని తెలిపారు. నిరుపేద జర్నలిస్టులకు వైద్యం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, హెల్త్ కార్డుల అంశంపై రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాల వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతున్నామని స్పష్టం చేశారు..

రాష్ట్ర నాయకత్వం ప్రశంసలు..

రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించినందుకు సంగారెడ్డి జిల్లా శాఖను, పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టులను రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా అభినందించింది. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ తదితరులు అభినందించారు.

కల్లెడ ఎస్సీ కాలనీలో ప్రభుత్వ రహదారి ఆక్రమణలు తొలగించాలి

పాత రోడ్డును యథావిధిగా పునరుద్ధరించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు కాలనీవాసుల వినతి..

అంగడి (సంత)ని ఆపే ప్రయత్నాలు మానుకోవాలి : గ్రామ ప్రజలు

(వరంగల్/పర్వతగిరి) నవంబర్ 04, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ సెంటర్ నుంచి పాత జమ్మి చెట్టు వరకు ప్రభుత్వ రహదారుల ఆక్రమణలను తొలగించి, పాత రహదారులను యథావిధిగా పునరుద్ధరించాలని కోరుతూ కాలనీవాసులు గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు తక్కలపల్లి శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన రహదారులను కొందరు వ్యక్తులు ఆక్రమించడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలోని పాత రహదారులు క్రమంగా కనుమరుగవుతున్నాయని, దీంతో ఇళ్లకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, గతంలో ఉన్న రహదారుల హద్దులను గుర్తించాలని, ఆక్రమణలు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు దాసరి శ్రీనివాస్, దాసరి లచ్చయ్య మాట్లాడుతూ ఇటీవల గ్రామస్థులకు అందుబాటులో ఉండాలని వారాంతపూ సంత ఏర్పాటు చేపిద్దామని నిర్ణయానికి పంచాయతీ పాలకవర్గం వస్తే దానికి మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్ అడ్డుకాలు వేస్తున్నారని గతంలో అతను సర్పంచిగా ఉన్నప్పుడే



ఎల్లమ్మ గుడి నిర్మాణం చేయించడం జమ్మిచెట్టు కూలగొట్టించడం, అంబేద్కర్ సెంటర్ నుండి స్కూల్ వెనుక నుండి అదే పాత జమ్మి చెట్టు వరకు ఉన్న దారిని పత్తా లేకుండా చేశారని అదే దళితులకు ఇచ్చిన భూమిని 15 గుంటలు అమ్ముకున్నాడని ఆరోపించారు. దళితులకు ఇచ్చిన భూమి అంటున్న అతను తన స్వప్రయోజనాల కోసం ఎలా అమ్ముకున్నాడని ప్రశ్నించారు. అదే దళితుల పేరు చెప్పి మళ్లీ ఏమీ ఆశించి సంతను అడ్డుకుంటున్నాడని ప్రశ్నించారు. సంతను అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. అందరూ కలిసి ప్రభుత్వ రహదారులను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంత ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల హామీల అమలులో ప్రభుత్వ జాప్యం!

పీఆర్సీ అమలు చేయాలి.. సీపీఎస్ రద్దు చేయాలి - టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ డిమాండ్

ప్రజాకలం న్యూస్ మరిపెడ, ప్రతినిధి నవంబర్ 4:

ఎన్నికల సమయంలో, ఉద్యోగ సంఘాలతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. టీపీటీఎఫ్ మరిపెడ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని ఇప్పటికీ అమలు చేయకపోవడం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీతో చర్చల సందర్భంగా పీఆర్సీ అమలుపై ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీని నిలబెట్టుకోవాలని, పీఆర్సీ కమిటీ నివేదిక సమర్పించి వెంటనే అమలు చేయాలని కోరారు.ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించడం సరికాదన్నారు. తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల కోసం ఉద్యోగుల



వేతనాల నుంచి 1.5 శాతం రికవరీ చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో రిఫరల్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ బకాయిల చెల్లింపు, హెల్త్ కార్డులపై స్పష్టమైన ఉత్తర్వుల జారీ వంటి నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు హఫీజర్, రవీంద్రకుమార్, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో గంజాయి కలకలం.. ముగ్గురు యువకుల అరెస్ట్!

రూ. లక్ష విలువైన 2 కిలోల గంజాయి స్వాధీనం.. మూడు సెల్‌ఫోన్లు, డిజిటల్ వెయింగ్ మిషన్ పట్టివేత

గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతాం: సీఐ ఎల్. పవన్ కుమార్

మరిపెడ ప్రజా కలం న్యూస్, నవంబర్ 4:

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది అని సీఐ ఎల్. పవన్ కుమార్ అన్నారు వారు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్ తన సిబ్బంది హెచ్‌సీలు శ్రీనివాస్, రాజు, పీసీలు రవీందర్, రమేష్, వెంకన్నలతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తొర్రూరు రోడ్డులోని మరిపెడ శివారు ప్రాంతంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన వారు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితులు పవార్ విజయ్ (20), మరిపెడకు చెందిన వ్యక్తి; కంది అభిరామ్, దమరాచపల్లి గ్రామం, భూపాలపల్లి జిల్లా వాసి; బానోత్ మణిదీపక్, సూర్యాపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి మరిపెడ, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేసేందుకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు వచ్చినట్లు



నిందితులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక డిజిటల్ వెయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సమాచారం ఇస్తే రూ. 5 వేల బహుమతి యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎల్. పవన్ కుమార్ హెచ్చరించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారికి రూ. 5 వేల నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ వెల్లడించారు.

ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్



ఖమ్మం, నవంబర్ 04(ప్రజా కలం న్యూస్)ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మొగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్లలో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు

కేటాయించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ నవంబర్ 04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) మాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో



కలెక్టర్ పర్యటించి, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల విస్తీర్ణం, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ శంకుస్థాపనకు ఆహ్వానం

తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ను కలిసిన అయ్యప్ప స్వామి పీఠం స్వాములు



తల్లాడ, నవంబర్ 04 ప్రజా కలం న్యూస్ తల్లాడలో కొత్తగూడెం రోడ్ లో ఈ నెల 16 వ తేదీన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ తల్లాడ అయ్యప్ప స్వామి పీఠానికి చెందిన స్వాములు బుధవారం గ్రామ సర్పంచ్ నాగేశ్వర రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ శంకుస్థాపన కార్యక్రమ వివరాలను తెలియజేసి, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను స్వాములు వివరించారు. గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కూడా స్వాముల ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు ఈలప్రోలు లాలయ్య స్వామి, అర్చకులు మణికంఠ శర్మ, బాలకృష్ణ స్వామి, పసుమర్తి కాశి స్వామి, పెరిక. మణి కంటతదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు నిమ్స్ లో మెరుగైన వైద్యం కోసం

రూ. 2లక్షల ఎల్వోసీ అందజేత

ఖమ్మం నవంబర్ 04(ప్రజా కలం న్యూస్) ఖమ్మం/ రఘునాథపాలెం మండలం గణేశ్వరంకు వాస్తవ్యులు అజ్మీరా చిన్న ప్రసాద్ కూతురు లాస్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్నారు.ప్రసాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను కలిసి తన కూతురు ఆరోగ్య పరిస్థితిని గురించి వివరించారు. ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి నిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం కోసం సీఏంఆర్ఏఫ్ ద్వారా రూ. 2 లక్షలు మంజూరు చేయించారు.ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోవీ)ను ఎంపీ వద్దిరాజు బుధవారం ఖమ్మం బురహాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో లాస్యశ్రీ తండ్రి చిన్న ప్రసాద్ కు అందజేశారు,ఈ సందర్భంగా ఆయన ఎంపీ రవిచంద్రకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసులతో విద్యార్థుల ముఖాముఖి

- 150 మంది విద్యార్థులకు పోలీసుల విధులు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

పటాన్‌చెరు, నవంబర్ 4 (ప్రజా కలం) ప్రతినిధి

పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, సమాజ భద్రతలో వారి పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ముత్తంగి రాజీవ్‌నగర్‌లోని మంజీరా పాఠశాల విద్యార్థులు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నాలుగు, ఐదో తరగతులకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు విద్యా విహారయాత్రలో భాగంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్టేషన్ అధికారి ఎం. రవీందర్ విద్యార్థులకు సాదర స్వాగతం పలికి, పోలీస్ స్టేషన్‌లోని అధికారులు, సిబ్బందిని పరిచయం చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలను వివరించారు. క్రమశిక్షణ, రోడ్డు భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, చరవాణుల సురక్షిత వినియోగం, మంచి నడవడికపై పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ చాక్లెట్లు,



పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు జగన్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, హమీదా, వ్యాయామ ఉపాధ్యాయుడు మోసెస్ పాల్గొన్నారు. పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు..

డ్రైనేజీనా.. మురుగునీటి కుంటనా

17వ వార్డులో పారిశుద్ధ్యం గాలికి



గద్వాల ప్రతినిధి, నవంబర్ 4 (ప్రజా కలం)

గద్వాల పట్టణంలోని 17వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండిన కాలువలు దోమలు, ఈగలకు నిలయాలుగా మారుతున్నాయి. దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.గత కొన్ని నెలలుగా డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదని, సంబంధిత కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితిపై మున్సిపల్ చైర్‌పర్సన్ తక్షణమే స్పందించి, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని 17వ వార్డు కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ సర్పంచుల మర్యాదపూర్వక భేటీ

రాబోయేది మన ప్రభుత్వమే మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్

ప్రజాకలం న్యూస్ / మరిపెడ మండల ప్రతినిధి నవంబర్ 4

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు బుధవారం మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు డీఎస్ రెడ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సర్పంచులతో ఆయన ఆత్మీయంగా మాట్లాడి, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ముందుకు సాగితే పార్టీ మరింత బలోపేతం అవుతుందని డీఎస్ రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేసినట్లు



తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ పునాదులను మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సర్పంచులకు సూచించారు.

మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్‌తో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీతో మరిపెడ మండల బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

ఎల్కూర్ కూరగాయల సంతను సందర్శించిన ఎస్పై శ్రీహరి



గద్వాల ప్రతినిధి, నవంబర్ 4 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలో నూతనంగా ప్రారంభమైన కూరగాయల సంతను మల్దకల్ ఎస్పై శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా సంతలో ఏర్పాటు చేసిన కూరగాయల విక్రయ కేంద్రాలను పరిశీలించి, వ్యాపారులు, గ్రామస్తులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పై శ్రీహరి మాట్లాడుతూ.. ప్రతి వారం కూరగాయల సంతను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గ్రామస్తులు, వ్యాపారులు పరస్పర సహకారంతో సంతను విజయవంతంగా కొనసాగించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.అనంతరం ఎస్పై శ్రీహరిని గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

అక్రమ నీటి వనరులపై ఉక్కుపాదం

ఏడు బోర్లు, రెండు సంపుల కూల్చివేత.. నీటి శుద్ధి కేంద్రం స్వాధీనం..

పటాన్‌చేరు, నవంబర్ 4(ప్రజా కలం) ప్రతినిధి అక్రమ నీటి వనరులపై అధికారులు కొరడా ఝుళిపించారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని వాణినగర్ కాలనీ సమీపంలో పెద్ద చెరువు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన నీటి వనరులపై అధికారులు ఆకస్మిక చర్యలు చేపట్టారు. అక్రమంగా ఏర్పాటు చేసిన ఏడు బోరుబావులను కూల్చివేయడంతో పాటు రెండు నీటి సంపులను తొలగించి, ఒక నీటి శుద్ధి కేంద్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా నీటి వనరులను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను వినియోగిస్తున్న వ్యవహారంపై అధికారులు తీవ్రంగా స్పందించారు. అక్రమ నీటి వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది. చెరువులు, భూగర్భ జలవనరుల పరిరక్షణకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నీటి వ్యాపారాలకు అడ్డుకట్ట వేసి, ప్రజా నీటి వనరులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు..



మహిళా కండక్టర్ మృతి బాధాకరం

- ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొంగులేటి



ఖమ్మం నవంబర్ 04(ప్రజా కలం న్యూస్)ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు.ప్రవళిక మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ.. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రవళిక కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి

- బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి పిలుపు



గద్వాల ప్రతినిధి నవంబర్ 4 (ప్రజా కలం) జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండ్ల వెంకట రాములు, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, సర్పంచ్ రాజేష్ అయ్యా, మండల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి నర్సన్ దొడ్డి కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రామిరెడ్డి, శేఖర్ రెడ్డి, కేటీదొడ్డి మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, శాలన్న, దరూర్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాగుంట బ్రహ్మోత్సవాలకు బాసు శ్యామలకు ఆహ్వానం



గద్వాల ప్రతినిధి, నవంబర్ 4 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం పాగుంట వెంకటాపురం గ్రామంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడును ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, చక్రిధర్ రెడ్డి, ఉపసర్పంచ్ మురళి, ఎర్ర భీమ్ రెడ్డి, పద్మారెడ్డి, ముని మౌర్య, తిమ్మప్ప, మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో టీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం

-మండల అధ్యక్షుడు బి. విష్ణు



గద్వాల ప్రతినిధి, నవంబర్ 4 (ప్రజా కలం):తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ మల్దకల్ మండల నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బి. విష్ణు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత, రాష్ట్ర నాయకులు, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బుచ్చిబాబు యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి మార్గదర్శకత్వంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంజనేయులు, మీడియా ఇన్‌చార్జి మునాఫ్, జాయింట్ సెక్రటరీలు రమేష్, లక్ష్మన్న, భీసన్న, గోపాల్, అధికార ప్రతినిధులు వెంకటేష్, తిరుపతమ్మ, శ్యామల, సలహాదారులు మీసాల కిష్టన్న, తిరుపతన్న, మండల కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరుస తుఫాన్లు... ఏం జరుగుతోంది

విజయవాడ : వారం రోజుల వ్యవధిలో ఏర్పడిన రెండు తుఫాన్లు ఏపీలో వర్షాభావాన్ని పూర్తిగా తగ్గించేశాయనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు తుఫాన్లు చాలా మేలు చేశాయని విశ్లేషిస్తున్నారు. తుఫాన్ కారణంగా చాలా నష్టం జరిగినప్పటికీ, భారీ వర్షాల కారణంగా వేసవి సవాళ్లను అధిగమించేలా అవకాశం లభించిందని అంటున్నారు. ప్రస్తుతం చేతికందిన పంట కొంతవరకు దెబ్బతిన్నప్పటికీ, రెండో పంటకు పుష్కలంగా నీరు లభించిందని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇటు రైతుకు అటు ప్రభుత్వానికి నష్టం జరిగినా, ఎల్ నినో ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా బయటపడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించినట్లేనని అంటున్నారు. ఎల్ నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 450 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. పంట దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళన ఎక్కువ కావడంతో మార్కెట్లో అనేక రకాల సరకులకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఎన్నడూ లేనట్లు నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబును రాజకీయంగా ఇరుకన పెట్టేందుకు ప్రత్యర్థులు ఈ వాతావరణ పరిస్థితులను కూడా వాడుకుంటున్నారు. రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నేతలతోపాటు తెలంగాణకు చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు కురవవు అనే సెంటిమెంటు ద్వారా రాజకీయం చేయాలని చూశారని అంటున్నారు. అయితే అనూహ్యంగా గత వారం రోజుల్లో రెండు తుఫాన్లు ఏర్పడటంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత నెల 28న కోనసీమ తీరాన్ని తాకిన అర్నబ్ తుఫాన్ వల్ల శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలే కురిశాయి. ఈ వర్షాల కారణంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు 20 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సమానంగా మేలు కూడా జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదపు కోస్తా ప్రాంతంలో పుష్కలంగా నీరు చేరిందని, అన్ని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయని చెబుతున్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లడంతో రానున్న వేసవికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఎల్ నినో కారణంగా 2027 జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని అంటున్నారు. దీనివల్ల తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణలో ఇప్పటికే ఈ సమస్య మొదలైందన్న వార్తలు వస్తున్నాయి. అయితే ఏపీకి మాత్రం రెండు తుఫాన్లు తాగునీటి ముప్పు లేకుండా చేశాయని, అదే సమయంలో రబీ పంటలకు సాగునీటి చింత లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. అర్నాబ్ కారణంగా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలు కురిస్తే, ఇప్పుడు మురసు తుఫాన్ వల్ల ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, పల్నాడు జిల్లాలతోపాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ఈ సీజన్ లో చుక్క నీరు కూడా చేరని పులిచింతల, నాగార్జున సాగర్ కు భారీగా వరద వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు ఆ ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో ఆశలు రేపుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరటనిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన చంద్రబాబు హయాంలో వర్షాభావ పరిస్థితులు ఎదురవడం అత్యంత సహజమే అయినప్పటికీ ఆయన రాజకీయ ప్రత్యర్థులు ప్రకృతిశాపంగా విమర్శలు చేయడం ద్వారా సీఎంను మానసికంగా ఇబ్బంది పెట్టేవారనిఅంటున్నారు. అయితే ఈ సారి ప్రకృతి ఇలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా తాను చంద్రబాబు పక్షాన ఉన్నట్లు నిరూపిస్తోందని అంటున్నారు. గత ఆగస్టులో కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు ఒకేసారి వరదలు వచ్చాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు లిఫ్ట్ ద్వారా రాయలసీమకు నీటిని తరలించి ఆ ప్రాంతంలో పంటలను కాపాడగలిగారని అంటున్నారు.ఇదే సమయంలో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు కరువు ఛాయలు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఇప్పుడు మిగిలిన ప్రాంతంలోనూ తుఫాను కారణంగా వర్షాలు కురిసి నీటి కొరత లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా గమనిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా భావించాల్సివస్తోందని అంటున్నారు.

టీటీడీకి కొత్త కమిటీ..

ముగ్గురు ఉన్నతాధికారులతో 'స్పెసిఫైడ్ అథారిటీ' ఏర్పాటు

తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేయడం జరిగింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉంటారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి రెండేళ్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. తిరుమల చరిత్రలో ఇలాంటి స్పెసిఫైడ్ అథారిటీలు ఏర్పాటు కావడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలోనూ పాలకమండలి పదవీకాలం ముగిసి కొత్త బోర్డు ఏర్పాటులో న్యాయపరమైన, సాంకేతిక అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వాలు అధికారులతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను నడిపిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈసారి ఎన్నికల నియమావళి అడ్డంకిగా మారడం, రాజకీయ నియామకాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించని కారణంగా .. ప్రభుత్వానికి స్పెసిఫైడ్ అథారిటీని తెరపైకి తేవడం అనివార్యమైంది. అనుభవజ్ఞులైన ఉన్నతాధికారులకే పాలనా పగ్గాలు అప్పగించడం ద్వారా రాజకీయ వివాదాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా వ్యవస్థను నడిపించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కోడ్ ముగిసిన తర్వాతే పూర్తిస్థాయి టీటీడీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది. అప్పటివరకు తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడం, రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం, నిధుల వినియోగంలో పారదర్శకతను కాపాడటం ఈ స్పెసిఫైడ్ అథారిటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తూ భక్తుల విశ్వాసానికి తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటుందని దేవదాయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేసింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉండనున్నారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.ఆయనతో పాటు అనుభవజ్ఞులైన మరో ఇద్దరి అధికారులు ఈ కమిటీలో ఉంటారు. ఈ ముగ్గురి టీమ్ శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, బోర్డు వ్యవహారాలను పర్యవేక్షించడం జరుగుతుంది. కొత్త టీటీడీ ట్రస్ట్ బోర్డును పునర్వ్యవస్థీకరించే వరకు లేదా ఏడాది కాల పరిమితి పూర్తయ్యే వరకు ఈ స్పెసిఫైడ్ అథారిటీ అమల్లో ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే సాధారణ టీటీడీ పాలకమండలికి ఉండే చట్టబద్ధమైన అన్ని అధికారాలు, విధివిధానాలు, నిర్ణయాధికారాలు ఈ కమిటీకి వర్తిస్తాయి. దీనివల్ల కొత్త బోర్డు ఏర్పాటులో జాప్యం జరిగినప్పటికీ భక్తుల సేవలు, శ్రీవారి నిత్యోత్సవాలు, పరిపాలనాపరమైన నిర్ణయాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుంది.అయితే టీటీడీకి ఇలా స్పెసిఫైడ్ అథారిటీ రావడం ఇదే తొలిసారి కాదు.. గతంలో అంటే 2010, 2021లో ఇలాంటి కమిటీలు ఏర్పాటయ్యాయి. 2010లో ఐఏఎస్ జె.సత్యనారాయణ సమక్షంలో, 2021లో అప్పటి ఈవో జవహర్ రెడ్డి చైర్మన్‌గా ప్రభుత్వాలు స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. బోర్డు లేని సమయంలో పాలన, పనులు, కార్యకలాపాల్లో ఎటువంటి ఆటంకం కలగకుండాఉండేందుకే అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో ఆశావహులసంఖ్యఎక్కువగా ఉండటంతో కొత్త బోర్డు కూర్పునకు సమయం పట్టే ఛాన్స్ ఉంది. అందుకే పాలన సాఫీగా సాగేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది.

మురసుతో నీటి కష్టాలకు చెక్

గుంటూరు : మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్ లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ట వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు గంటలకు ఒకసారి బులెటిన్ వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓ సారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు.

విజయసాయిరెడ్డి పార్టీలోకి టీడీపీ నేత

నెల్లూరు : సీనియర్ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆయన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.. పార్టీ ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఆయన విజయసాయిరెడ్డి కి అండగా నిలుస్తానని.. ఆయన ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. విజయసాయిరెడ్డి నవంబర్ 11న పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి దసరా పండుగ సమయంలో పార్టీ ఏర్పాటు చేయాలని భావించారు..కానీ స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా ఇతర కారణాల దృష్ట్యా నిర్ణయం మార్చుకున్నారు. ఈ నెలలోనే ఆయన కొత్త పార్టీ ప్రారంభించనున్నారు.విజయసాయిరెడ్డి గత నెలలో తిరుపతిలో తన పార్టీ గురించి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు. అనంతరం మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేంకటేశ్వర స్వామిని విజయసాయి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన ఆయన.. కొత్త పార్టీ విర్భావం, తనతో కలిసి పనిచేయబోయే వారి గురించి చెప్పుకొచ్చారు. కొత్త పార్టీకి స్వామి వారి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. అలాగే తన సహచుడు ఓవీ రమణను కొత్త పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. తాము గతంలో నాలుగేళ్ల పాటు టీటీడీ బోర్డు సభ్యులుగా కలిసి పని చేశామని విజయసాయిరెడ్డి గుర్తు చేసుకున్నారు. నూతన పార్టీలో ఇద్దరం కలిసి విజయం సాధిస్తామన్నారు. విజయసాయిరెడ్డి ఆహ్వానం మేరకు కొత్త పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు.తిరుపతికి చెందిన ఓవీ రమణ టీడీపీలో కీలక నేతగా ఎదిగారు. అయితే 2019లో ఆయన బీజేపీలో చేరారు.. 2020లో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే కారణంతో బీజేపీ ఆయనను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన తిరిగి టీడీపీలో చేరి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన గతంలో టీటీడీ పాలకమండలి సభ్యుడిగా కూడా పనిచేశారు. తిరుమల లడ్డూ నాణ్యత, ఆలయాల రక్షణ వంటి పలు అంశాలపై ఓవీ రమణ మాట్లాడారు. అయితే ఆయన టీడీపీకి రాజీనామా చేసి విజయసాయిరెడ్డి కొత్త పార్టీలో చేరతాననడం ఆసక్తికరంగా మారింది.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ : అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్టవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతులకు లైన్ క్లియర్ చేసింది. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్‌గా నమోదైన వెంటనే, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా అధికారుల నుంచి ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్‌ని అందించాల్సిన అవసరం ఇకపై ఉండదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అయిన వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా భద్రపరచాలని, ఈ సరికొత్త గైడ్‌లైన్స్‌ను రెవెన్యూ యంత్రాంగం తప్పకుండా పాటించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల భూ వివాదాలకు తెర పడే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కానున్నాయి.

డిసెంబర్ లో ఏపీ కేబినెట్ పునర్వ్యస్థీకరణ !

విశాఖపట్టణం : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్ పునర్వ్యస్థీకరణ ఉంటుందనే ప్రచారం ఊపందుకుంది. ప్రధానమైన మున్సిపల్ ఎన్నికలు ముగియడం, రెండు రోజుల్లో జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు కూడా పూర్తికానున్నాయి. అదేవిధంగా ఈ నెల 26, 28 తేదీలతోపాటు డిసెంబరు 2న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రహసనం ముగియనుంది. ఇక 2029 ఎన్నికలే టార్గెట్ గా ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డిసైడ్ అయ్యారని అంటున్నారు. డిసెంబరు 2న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యస్థీకరించాలని సీఎం భావిస్తున్నారని పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2024 జూన్ లో రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే డిసెంబరుతో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంటారు. ఇంకా రెండున్నరేళ్ల పాలన మిగిలివున్నప్పటికీ చివరి సంవత్సరం పూర్తిగా ఎన్నికలకే అంకితం చేయాల్సివుంటుందని అంటున్నారు. అంటే ఇంకా గట్టిగా ఏడాదిన్నర మాత్రమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేయనుందని, ఈ కారణంగా గత రెండున్నరేళ్ల పాలనను పునః సమీక్షించుకోవడంతోపాటు లోపాలను సరిదిద్దుకునేందుకు వచ్చే ఏడాదిన్నర కాలం వినియోగించుకోవాలని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఒకవైపు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు తమ బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారో కూడా పర్యవేక్షిస్తున్నారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కూటమి పార్టీలలో చాలా మంది మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఇందులో కొందరికి తొలివిడతలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి త్వరలో విస్తరణ చేపట్టి ఎన్నికల జట్టును సిద్ధం చేయాలని భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్నవారిలో కొందరిని తప్పించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలనే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం హీట్ ఎక్కిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్షం వైసీపీకి గట్టి పునాదులు ఉన్న రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. రాయలసీమలో ప్రస్తుతం ఏడుగురు మంత్రులు ఉండగా, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, వారితో ఎన్నికలకు వెళితే పార్టీకి పెద్దగా ప్రయోజనం ఉండదని సీఎం భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు సొంత నియోజకవర్గం, జిల్లాల్లో వ్యతిరేకత ఎదుర్కొంటుండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో చాలా మంది కొత్తవారికి అవకాశం ఇవ్వడం కూడా ఈ పరిస్థితికి కారణంగా సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో అనువజ్ఞులను తీసుకోవాలన్న ప్రతిపాదనను సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో వైసీపీని కంట్రోల్ చేసే నాయకుల కోసం సీఎం అన్వేషిస్తున్నారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలను చూసి మంత్రులు, కొత్తగా మంత్రి పదవులు ఇచ్చే నేతలపై ఒక అవగాహనకు రావాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. తమ జిల్లాలతోపాటు ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న జిల్లాల్లో ఫలితాలను బేరీజు వేసి మంత్రుల పనితీరుపై అంచనాకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అదేసమయంలో ప్రత్యర్థిపై పైచేయి సాధించేలా వ్యూహరచన చేసిన నేతల సామర్థ్యాన్ని పరిశీలనకు తీసుకోవాలని, అటువంటి వారికి సముచిత గౌరవం కల్పించాలని సీఎం ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీంతో జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా మంత్రులు, ఎమ్మెల్యేలు పోటాపోటీగా పనిచేస్తున్నట్లు టీడీపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి

స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..

చెన్నై : కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు తెలుస్తోంది.

తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి,



అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

- విచారణ వేగవంతం చేసి నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలి.

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 04 (ప్రజా కలం ప్రతినిధి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కేసుల విచారణను వేగవంతం చేసి, త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇటీవల నియామకమైన నూతన కమిటీ సభ్యులను సన్మానించారు,అనంతరం ఎస్సీ, ఎస్టీ సంక్షేమంతోపాటు మత్స్య, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో విచారణ పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేస్తే బాధితులకు న్యాయం జరగడంతోపాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అట్రాసిటీ కేసుల బాధితులకు రూ. 1.81 కోట్లకు పైగా పరిహారం అందించినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కమిటీ సభ్యులకు సూచించారు.ప్రతి నెలా చివరి రోజున అన్ని మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, ఉపకార వేతనాలు, విదేశీ విద్య, ప్రభుత్వ సబ్సిడీలు, ఉపాధి కల్పన పథకాలపై అర్హులకు అవగాహన కల్పించాలన్నారు.

స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మహేష్ బి.గితె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ చేపడుతూ చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో డీఆర్వో జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, కమిటీ సభ్యులు బి.నరేష్ నాయక్, బీపేట రాజు, భూక్య రమేష్, బడుగు లింగయ్య, జోగు రవీందర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోట లహరి, వీర రమణయ్య, చింతోజు భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసోజిపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల

మేరకు సర్పంచ్ విజేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం.



సంగారెడ్డి ప్రతినిధి
నవంబర్ 04(ప్రజా కలం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో భాగంగా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామంలో బుధవారం డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ విజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వార విక్రయించి, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రెండో రోజు వైభవంగా ఆలయ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం పాల్గొన్న గ్రామ సర్పంచ్ విశ్లావత్ శ్రీనివాస్ నాయక్



మహేశ్వరం , నవంబర్ 4, (ప్రజా కలం)

కందుకూరు మండలం గొల్లెలగడ్డ తండా గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు కార్యక్రమాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిర్ణీత కార్యక్రమాల ప్రకారం వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం కూడా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. ఈ రెండో రోజు మహోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో గ్రామ సర్పంచ్ విశ్లావత్ శ్రీనివాస్ నాయక్ గారి సహకారం ఎంతో కీలకంగా నిలిచింది. గ్రామ ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ, మహోత్సవాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా జరిగేలా ఆయన కృషి చేశారు.ఆలయ చైర్మన్ కొర్ర రాజు, ఆలయ అధ్యక్షుడు జర్పుల రవి, పూజారి రాజు శర్మ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించబడ్డాయి.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొర్ర పద్మ, రవి నాయక్, గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం గ్రామ ప్రజలందరికీ ఎంతో పవిత్రమైన, సంతోషకరమైన సందర్భం. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయడం ఆనందంగా ఉంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తిభావాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు.
గ్రామ ప్రజలందరి సహకారం, ఆలయ కమిటీ సభ్యుల సమన్వయం, గ్రామపంచాయతీ పాలకవర్గం కృషితో రెండో రోజు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటి అధ్యక్షులుగా లింగం నర్సింహ్మా ముదిరాజ్ ఎన్నిక

ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటి అధికారికంగా రిజిస్ట్రేషన్

సంతోషం వ్యక్తం చేసిన ముదిరాజ్ మత్స్యకార సొసైటి సభ్యులు

మహేశ్వరం, నవంబర్ 04, (ప్రజా కలం)

ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధికారికంగా రిజిస్ట్రేషన్ అయింది. రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ ఏ డి వెంకటయ్య, రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ చైర్మన్ దూస వెంకటేష్ శేరిగూడ, రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ డైరెక్టర్ కుక్కల కృష్ణ తుక్కుగూడ, వారు సహకరించినందుకు వారికి సొసైటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దీంతో ముదిరాజ్ మత్స్యకార సొసైటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కొంగర ఖుర్దు రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్తకుంట, కోమటి కుంట, మైసమ్మ కుంట ఈ మూడు కుంటలపై చేపలు పెంచి పట్టుకోవడానికి కొంగర ఖుర్దు ముదిరాజులకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మత్స్యకార సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. లింగం నరసింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ మత్స్యకార సొసైటీ కోసం ముదిరాజులు గత నాలుగైదు సంవత్సరాలుగా ఆఫీసుల చుట్టూ తిరిగి చివరకు ఈరోజు విజయం సాధించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ పెద్దలు లింగం నర్సింహ్మ ముదిరాజ్, సొప్పరి యాదయ్య ముదిరాజ్, లింగం సురేష్ ముదిరాజ్, మీగడ రాజ్ కుమార్ ముదిరాజ్ లు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా లింగం నర్సింహ్మ ముదిరాజ్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో లింగం తిరుమలేష్ ముదిరాజ్, శేరిగూడ వాసులు వెంకటేష్ ముదిరాజ్, తుక్కుగూడ కుక్కల క్రిష్ణ ముదిరాజ్, సప్పిడి శ్రీరాములు ముదిరాజ్, మీగడ శేఖర్ ముదిరాజ్, పొలమోని శ్రీనివాస్ ముదిరాజ్, రాగనమోని ప్రభాకర్ ముదిరాజ్, తాళ్ళ రమేష్ ముదిరాజ్, సొప్పరి బాబులు ముదిరాజ్, పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, పొలమోని శ్రీకాంత్ ముదిరాజ్, రాగనమోని పాండు ముదిరాజ్, సప్పిడి నాగేష్ ముదిరాజ్, కాగు నర్సింహ్మ ముదిరాజ్, రాగనమోని శేఖర్ ముదిరాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



ధర్మారెడ్డిపల్లి రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

ఏడాదిగా గుంతలమయమైన రహదారి.. ప్రయాణికులకు ఇబ్బందులు

గజ్వేల్, నవంబర్ 4
(ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో నిలిచిపోయిన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఎలకంటి సురేష్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. గజ్వేల్ నుంచి చేగుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని, దాదాపు ఏడాది గడుస్తున్నా మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారిపై నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులను పూర్తి చేయాలని కోరారు. రోడ్డు మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే గ్రామస్తుల సహకారంతో బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వంజరి రాజు, ధాతర్‌పల్లి సర్పంచ్ దివ్య రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, బీనమైన ప్రభాకర్, శాతం స్వామి, మండల కార్యదర్శి కూర స్వామి, మండల కోశాధికారి పంజ బాలయ్య, మండల సీనియర్ నాయకులు బోయిని సత్యం, రామస్వామి, వాచిని శివప్రసాద్, నగేష్, శ్రీరామ్ రాజు, బీజేవైఎం నాయకులు మహేష్ చారి, సాయికిరణ్, అనిల్, సంతోష్, చందు, మండల నాయకులు కర్నాల గణేష్, నరేష్ గౌడ్, కర్ణాకర్, మణికంఠ, రాజు, మల్లేశం, మహేందర్, చింటూ, మురళి తదితరులు పాల్గొన్నారు.

గుండ్ల మాచనూరులో కాలుష్య కష్టాలు..

- పిసిబి అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం!

- కంపెనీ యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- లేనిపక్షంలో పీసీబీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: గ్రామస్తుల హెచ్చరిక.

సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 04 (ప్రజా కలం): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచనూరు గ్రామంలో కాలుష్య నమన్య రోజు రోజుకూ తీవ్రతరమవుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్య నమస్యలతో నతమతమవుతున్నప్పటికీ నంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిధిలోని కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గ్రామస్తుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని, ముఖ్యంగా రహదారులపై ప్రయాణించే విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.

ఈ నమన్యపై వలుమార్లు కంపెనీ యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే జిల్లా అధికారులకు, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంపై



గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలుష్య సమస్యపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. లేనిపక్షంలో పీసీబీ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఉపాధ్యాయుల ఆన్‌లైన్ పని భారం తగ్గించాలి

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలి

తరగతి గది బోధనకు అధిక సమయం కేటాయించేలా చర్యలు తీసుకోవాలి: సుంచు నరేందర్

గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 4 (ప్రజా కలం ప్రతినిధి):

ఉపాధ్యాయులపై ఉన్న ఆన్‌లైన్ పని భారాన్ని, అనవసర రిపోర్టుల నిర్వహణను తగ్గించి,తరగతి గది బోధనకు అధిక సమయం కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు.వర్గల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి పిల్లి రాములు ఆధ్వర్యంలో మండలంలోని గౌరారం,ఆవుసులోనిపల్లి,వర్గల్, మైలారం,నెంటూర్,నాచారం, అంతగిరిపల్లి,వేలూరు,మాదారం, మజీద్‌పల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుంచు నరేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధనేతర పనులు,ఆన్‌లైన్ రిపోర్టుల నిర్వహణకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని అన్నారు. అనవసరమైన పని భారాన్ని తగ్గించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా తరగతి గది బోధనకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వ



పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని,ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని,ఒక వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ శ్రీనివాస్, మండల నాయకులు సంతోష్ కుమార్, యాదగిరి,నర్సింగరావు,కృష్ణ, రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు..

మూడు గ్రామాల ప్రజల బస్సు కష్టాలకు పరిష్కారం

- ఎమ్మెల్యే చొరవతో సికింద్రాబాద్ రాఘువాపురం సర్వీసు ప్రారంభం

-బస్సు సౌకర్యంపై హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు, ఉద్యోగులు

బీబీనగర్, నవంబర్ 04 (ప్రజాకలం):

మండలంలోని రాఘువాపురం, రుద్రవెల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులకు పరిష్కారం లభించింది. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో ఆయా గ్రామాలకు ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభించారు. బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో రవాణా శాఖ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు.బుధవారం రాఘవపురం గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్



పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్ తో కలిసి గ్రామ సర్పంచ్ సిద్ధగాని శ్రీకాంత్‌గౌడ్, రుద్రవెల్లి సర్పంచ్ జిల్కపల్లి సరళ అశోక్‌రెడ్డిలు పూజలు నిర్వహించి బస్సును ప్రారంభించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాఘువాపురం, రుద్రవెల్లి గ్రామాలకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి చెంగిచెర్ల డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రుద్రవెల్లి, పల్లెగూడెం మీదుగా రాఘువాపురం వరకు ఉదయం, రాత్రి రెండు ట్రిప్పులు నడిపేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా యాదగిరిగుట్ట వరకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డిపో మేనేజర్‌తో మాట్లాడి వారం రోజుల్లో యాదగిరిగుట్ట బస్సు సర్వీసును కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శ్యామ్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బస్సు సర్వీసు అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాఘువాపురం ఉపసర్పంచ్ సిలివేరు కవిత మహేశ్, వార్డు సభ్యులు, రుద్రవెల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అమనగంటి వెంకటేశ్, వార్డు సభ్యుడు కర్షక నవీన్,విద్యార్థులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేసిన సర్పంచ్ గోపీ నాయక్

బీబీనగర్,నవంబర్ 04 (ప్రజాకలం): మండలంలోని రామునిగుండ్ల తండాలో బానోతు సునీత--మోహన్ దంపతులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ఇంటి నిర్మాణ స్థలంలో గ్రామ సర్పంచ్ బానోతు గోపీ నాయక్ భూమిపూజ



నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇల్లు లేని పేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని, లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బార్మవత్ భిక్షపతి నాయక్, నగేష్ నాయక్, రాజు నాయక్, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నిర్వహణ

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

బీబీనగర్, నవంబర్ 04 (ప్రజాకలం): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున సాగునీరు, తాగునీటి వినియోగంతో పాటు విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల మట్టం పెంచేందుకు వీబీజీ–రామ్‌జీ పథకం ద్వారా పంట కుంటలు, జలసిరి తదితర నీటి సంరక్షణ పనులు చేపట్టాలని తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చర్చించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

-మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు



వలిగొండ నవంబర్ 4 ప్రజాకలం: రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా గ్రామస్థాయిలోనే పటిష్టమైన చర్యలు చేపట్టాలని,వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని, మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు అన్నారు.వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో 45 రోజుల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి,తహసీల్దార్ దశరథ నాయక్ తదితరులు పాల్గొన్నారు.వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించాల్సిన సేవలపై సర్పంచులకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావం,నీటి వనరుల పరిరక్షణ,తాగునీటి నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో వివరించగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. 45 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు,గ్రామాల సర్పంచులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో వైద్య సేవలకు మరింత బలోపేతం

- డాక్టర్ రెడ్డీస్ ఆధ్వర్యంలో 27వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్
- గంగువాడ పీహెచ్‌సీని ఆరోగ్య శాఖకు అప్పగించిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్
- 59 గ్రామాలకు చెందిన 33,979 మందికి మెరుగైన వైద్య సేవలు



శ్రీకాకుళం, నవంబరు 4 (ప్రజాకలం) : గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తన సేవలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం మండలం గంగువాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆధునిక సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు అధికారికంగా అప్పగించింది. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చేపట్టిన 'ఆరోగ్య మౌలిక సదుపాయాలు, అనుబంధ కార్యకలాపాల బలోపేతం' కార్యక్రమంలో భాగంగా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. 2022 సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లాలో 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ సంయుక్త భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. గంగువాడ పీహెచ్‌సీ 59 గ్రామాల్లోని 9,878 కుటుంబాలకు చెందిన 33,979 మందికి వైద్య సేవలు అందిస్తోంది. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 68 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆనువత్రి తొమ్మిది గ్రామ సచివాలయాలు, ఎనిమిది ఆయుష్మాన్ ఆరోగ్య మందిరా లతో అనుసంధానమై ఉంది. కేంద్రం అప్‌గ్రేడ్‌తో స్థానిక ప్రజలకు మరింత విస్తృతమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అవసరమైన సందర్భాల్లో ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గడంతో పాటు సకాలంలో వైద్యం పొందే అవకాశం మెరుగుపడనుం ది. డాక్టర్ ఎన్. హిమశ్రీ (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్), బి. లింగమూర్తి (హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) సమక్షంలో అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాన్ని ప్రారంభించి ఆరోగ్య శాఖకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, సంస్థ కంపెనీ సెక్రటరీ, కంప్లయన్స్ ఆఫీసర్, సీఎస్ఆర్ హెడ్ కుమార్ రణధీర్ సింగ్, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపర చడంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం ఎంతగానో దోహదపడుతుందని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

ఫీచర్ ఫోన్ల విభాగంలో 34 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానం



న్యూఢిల్లీ, నవంబర్ 4(ప్రజాకలం) :: ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఐటెల్ భారత మార్కెట్లో అరుదైన ఘనత సాధించింది. దేశవ్యాప్తంగా 15 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుని సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2016లో భారత మార్కెట్లో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ పదేళ్లలోనే కోట్లాది కుటుంబాల ఆదరణ పొందడం విశేషం. నాణ్యత, మన్నిక, నమ్మకత్వంతో పాటు అందుబాటు ధరల్లో సాంకేతిక ఉత్పత్తులను అందించడమే తమ విజయానికి కారణమని సంస్థ పేర్కొంది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, ఫీచర్ ఫోన్లు, టీవీలు, గృహోపకరణాలు, స్పీకర్లు, ఆడియో ఉత్పత్తులు, ఇతర యాక్సెసరీలను ఐటెల్ మార్కెట్లో అందుబాటులో ఉంచుతోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ గణాంకాల ప్రకారం.. 2026లో దేశీయ ఫీచర్ ఫోన్ మార్కెట్లో 34 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. రూ.10 వేలలోపు మొబైల్ ఫోన్ల విభాగంలోనూ 36 శాతం మార్కెట్ వాటాను సాధించింది.

ఈ సందర్భంగా ఐటెల్ ఇండియా సీఈఓ అరిజీత్ తలపాత్ర మాట్లాడుతూ.. 15 కోట్ల మంది వినియోగదారుల ఆదరణ తమ పదేళ్ల ప్రయాణంలో అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, విశ్వసనీయమైన సాంకేతిక ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా సర్వీస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. అర్హత కలిగిన మొబైల్ మోడళ్లపై 100 రోజుల ఉచిత స్క్రీన్ రీప్లేస్‌మెంట్, ఫీచర్ ఫోన్లకు కౌంటర్ రీప్లేస్‌మెంట్ సదుపాయాలను కల్పిస్తోంది. సిటీ 300 5G, పవర్ 80 5G వంటి మోడళ్లలో ఐపీ రేటింగ్, MIL-STD సర్టిఫికేషన్ వంటి ప్రత్యేకతలను అందిస్తోంది. సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) నిర్వహించిన అధ్యయనంలో స్మార్ట్‌ఫోన్ల విభాగంలో 0.86, స్మార్ట్ డివైజ్‌ల విభాగంలో 0.88 స్కోర్లు సాధించింది. సర్వేలో పాల్గొన్న వారిలో 85 శాతం మంది ఐటెల్ ఉత్పత్తులు ధరకు తగిన విలువ కలిగినవని, 81 శాతం మంది మన్నికైనవని అభిప్రాయపడినట్లు సంస్థ వెల్లడించింది. భవిష్యత్తులో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, గృహోపకరణాలతో పాటు మరిన్ని కొత్త ఉత్పత్తి విభాగాల్లోకి విస్తరించాలని ఐటెల్ ప్రణాళికలు రూపొందిస్తోంది. అందుబాటు ధరల్లో ఆధునిక సాంకేతికతను మరిన్ని భారతీయ కుటుంబాలకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

"ఓట్ చోర్" నినాదంతో ఘాట్కోపర్ ఉద్యమమయం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 4:

ఘాట్‌కోపర్ సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగ విరుద్ధ, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ముంబై తూర్పు ఘాట్కోపర్ స్టేషన్ బయట నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు అవినీతి ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించండి, ఇ.వి.ఎం యంత్రాలను నిలిపివేయాలి, బ్యాలెట్ పేపర్‌ను ప్రారంభించండి, ఎస్.ఐ.ఆర్‌ను రద్దు చేయాలి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా చేయాలి, ఐఐటి ముంబై సాహిల్ వాకోడే సంస్థగత హత్యకు బాధ్యులపై చర్య తీసుకోవాలి, భీమాశంకర్ అభయారణ్యం, కర్జత్ అడవుల నరికివేతకు సంబంధించిన ప్రణాళికాబద్ధమైన ప్రాజెక్టులను రద్దు చేయాలాంటు నినాదాలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాల్ని విడనాడాలి అంటూ ఆందోళన కారులు హెచ్చరించారు. ఈ నిరసనలో కిషోర్ కర్డక్, దాదాసాహెబ్ యాదవ్, ప్రవీణ్ కేదారే, జయవంత్ హిరే, జీవన్ బాలేరావు, అనికేత్ సోనావనే, దీపక్ గైక్వాడ్, మిలింద్ గెగాడ్మల్, సిద్ధార్థ్ దండోరే, రమేష్ చౌవల్ తదితరులు పాల్గొన్నారు.




మండలాన్ని కరువు మండలం గా ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని ప్రతి పేదవాడికి నెలకు 50 కిలోల సన్న బియ్యం ఇవ్వాలి

-ర్యాకల శ్రీశైలం, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి

బొమ్మలరామారం,నవంబర్ 04 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎల్ నీనో ప్రభావంతో బొమ్మలరామారం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని ప్రతి పేదవాడికి ప్రతి నెల 50 కిలోల సన్న బియ్యం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజులలో పేదవాడు బ్రతకడమే కష్టం అవుతుందని అన్నారు ఎల్ నీనో ప్రభావం, జిల్లాలో,మండలంలో కరువు తాండవిస్తుండడంతో రాబోయే రోజుల్లో నిత్యవసర వస్తువులు మరియు ఇతర వస్తువుల ధరలు ఆకాశాన్ని వెళ్లే అవకాశాలు ఉన్నాయని అన్నారు ప్రస్తుతం పంటలు పండకపోవడంతో వ్యవసాయ రైతులకు,కార్మికులకు, నిరుపేదలకు పని లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు అందువల్ల బియ్యం, సరుకులు,నిత్యవసర వస్తువులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పంపిణీ చేయాలని అన్నారు లేనిపక్షంలో మండలంలో ఆహార భద్రత (ఎఫ్ ఎస్ సి) గోడౌన్లను ముట్టడిస్తామని అన్నారు వర్ష భావ పరిస్థితులు లేక తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కరువు మండలంలో వీబిజి రామ్ జీ చట్టం ప్రకారం ప్రతి రోజు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు ప్రభుత్వమే ఉపాధి కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ప్యారారం వెంకటేష్, దేశెట్టి సత్యనారాయణ, మోకు దేవేందర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



తిమ్మాపూర్‌లో వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు విజయవంతం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 4:

గ్రామ సమగ్ర అభివృద్ధి మరియు ప్రగతి పథంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహించిన ప్రత్యేక ఇంటి పన్ను వసూళ్ల కార్యక్రమం వంద శాతం లక్ష్యంతో విజయవంతంగా ముగిసింది. గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ



కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాస నరేందర్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పాల నరేష్ మాట్లాడుతూ... మెరుగైన సమాజ నిర్మాణం, ప్రజల సంక్షేమం మరియు మహాత్మా గాంధీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యం' సాధనే ధ్యేయంగా తమ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ఈ పన్ను వసూళ్ల కార్యక్రమంలో 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి రాత్రింబవళ్లు శ్రమించిన జీపీ (గ్రామపంచాయతీ) సిబ్బంది అందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామ అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లిస్తున్న గ్రామస్తుల మంచి మనసును, వారి సహకారాన్ని సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి ప్రాథమిక అవసరాలు మరియు ఏవైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన కేసులో నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 4:

కులం పేరుతో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని దూషించిన కేసులో నిందితులకు నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది.డిచ్‌పల్లి మండలం దూస్గాం గ్రామంలో 63 మాదిగ కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరిస్తూ, కులం పేరుతో అవమానిస్తున్నారని బాధితుడు గర్క సురేష్ 2021 ఆగస్టు 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో నవంబర్ 4, 2026న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్. నారాయణ తీర్పు వెల్లడించారు.ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3(1)(తీ)(o) ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. దయాకర్ గౌడ్ వాదనలు వినిపించగా, కేసు దర్యాప్తు చేసిన అప్పటి నిజామాబాద్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఎస్ఐ బి. ఆంజనేయులు తదితరులు కీలక పాత్ర పోషించారు. కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. కులం పేరుతో దూషణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



దీపావళి సందర్భంగా పేకాటపై పోలీసుల ఉక్కుపాదం

పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు: సీపీ సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 4:

దీపావళి పండుగ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పేకాటను పూర్తిగా నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పేకాట నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట స్థావరాలపై నిఘా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ప్రజలు పోలీసులకు సహకరించి దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరిన బంజారా నాయకుడు గోపాల్

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే మాణిక్‌రావు

మొగుడంపల్లి నవంబరు 4 (ప్రజాకలం) :

తెలంగాణ లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం గౌరవ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మొగుడంపల్లి మండల పార్టీ



అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. గోపాల్ బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. ఆయన చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బంజారా సమాజ అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరిన గోపాల్‌కు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మొగుడంపల్లి మండల నాయకులు గోపాల్, సంజీవ్ పవార్, శేఖాపూర్ తండా సర్పంచ్ మోహన్ చౌహాన్, గోపాల్ శ్రీను, శంకర్, రాజు పవార్, విజయ్ రాథోడ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బంజారా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- నంది కమాన్ వద్ద నూతన పటాసుల దుకాణం ప్రారంభం.

వేములవాడ, నవంబర్ 04 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ పటాసుల దుకాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణంలో



ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నిర్వాహకులు ఎర్ర శ్రీనివాస్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమని, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు, పట్టణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో పటాసుల కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అందించాలని నిర్వాహకులకు సూచించారు. పటాసుల విక్రయాలు, నిల్వ విషయంలో సంబంధిత శాఖల నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ స్థానిక కౌన్సిలర్ కాశ శ్రీనివాస్, విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ కుటుంబ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త బుస్స దశరథం, పట్టణ ప్రముఖ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో మెగా ముకుంద జ్యువెలరీ షోరూం ప్రారంభం

14వ బ్రాంచ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు.. బంగారు ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్

కూకట్‌పల్లి నవంబరు 4 (ప్రజాకలం) :

తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన ముకుంద జ్యువెలర్స్ మరో కీలక అడుగు వేసింది. సంస్థ 14వ షోరూంను హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో 'మెగా ముకుంద' పేరుతో బుధవారం ఘనంగా ప్రారంభించింది. పీఎన్ఆర్ ఎంపైర్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ విశాలమైన షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఈ. రవికిరణ్‌రెడ్డి



తదితరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ముకుంద జ్యువెలర్స్ చైర్మన్ బత్తి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు డాక్టర్ నిఖితారెడ్డి, దాచేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రత్యేక ఆఫర్ ప్రకటించారు. బంగారు ఆభరణాలపై తరుగు కేవలం 6.99 శాతం మాత్రమేనని, ఎలాంటి మేకింగ్ ఛార్జీలు లేకుండా ఈ ఆఫర్ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక అవకాశం నవంబర్ 4 నుంచి 15వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ముకుంద జ్యువెలర్స్ షోరూంలు కూకట్‌పల్లి, ఖమ్మం, కొత్తపేట, సోమాజిగూడ, హన్మకొండ, సుచిత్ర, చందానగర్, జూబ్లీహిల్స్, విశాఖపట్నం, బెంగళూరులోని జయనగర్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. కేపీహెచ్‌బీలో పూర్వి గోల్డ్ అండ్ డైమండ్స్ కూడా కార్యక్ర లాపాలు నిర్వహిస్తోంది. త్వరలో భీమవరంలో మరో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించిన హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి

-మౌలిక వసతులు కల్పించి శాశ్వత భవనం నిర్మించాలి.. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం



మహేశ్వరం, నవంబర్ 4 (ప్రజాకలం): ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంగళ్‌పల్లిలో భారత్ కాలేజీ భవనంలో తాత్కాలికంగా కొనసాగుతున్న మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడి, కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. మౌలిక వసతుల కొరత, ఇతర సమస్యలను విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అన్ని వసతులతో కూడిన శాశ్వత ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాన్ని త్వరితగతిన నిర్మించి, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యలను సావధానంగా విన్న హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి.. వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో కత్తులతో

కసాయి అల్లుడి దాడి

- ఇద్దరు మహిళలు దుర్మరణం
- జయశ్రీ కాలనీలో రక్తసిక్తం
- ఉదయమే ఫిర్యాదు చేసినా స్పందించలేదు?
- ఘటనా స్థలానికి పోలీసు ఉన్నతాధికారులు




మహేశ్వరం , నవంబర్ 4, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి కత్తితో కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.



మీర్‌పేట్‌లోని జయశ్రీ కాలనీలో బుధవారం సాయంత్రం ఈ దారుణం జరిగింది. కుటుంబ కలహాలతో ఆగ్రహానికి గురైన అల్లుడు పదునైన కత్తితో అత్త నిరంజన్ బీ, బావమరిది భార్య రేష్మపై దాడి చేయడంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో నిందితుడి భార్య, కుమార్తెతో పాటు బావమరిది యూసుఫ్ తీవ్రంగా గాయపడ్డారు. యూసుఫ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయమే పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. ముందే చర్యలు తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.



కులాంతర వివాహం..

ఎనిమిదేళ్లుగా సామాజిక వెలివేత

కుల వివక్షతో కుటుంబానికి వేధింపులు..

న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

గజ్వేల్, నవంబర్ 4 (ప్రజా కలం ప్రతినిధి):

కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో ఓ కుటుంబాన్ని గత ఎనిమిదేళ్లుగా సామాజికంగా వెలివేస్తూ, వివిధ రూపాల్లో వేధిస్తున్నారని కేవీపీఎస్ నాయకులు ఆరోపించారు. పండుగలు,శుభకార్యాలకు దూరంగా ఉంచడంతో పాటు,గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియలకు వెళ్లి పరామర్శించేందుకు సైతం అడ్డంకులు సృష్టిస్తున్నారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. గజ్వేల్ మండలం బూరుగుపల్లికి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన దేవునూరి (పెద్దుల) శ్రీనివాస్, కొడకండ్ల గ్రామానికి చెందిన చాకలి సామాజిక వర్గానికి చెందిన కల్పన ఎనిమిదేళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు. వివాహం జరిగినప్పటి నుంచి తమ కుటుంబంపై కుల వివక్ష చూపుతున్నారని,గ్రామంలో జరిగే పండుగలు,శుభకార్యాలకు దూరంగా ఉంచుతున్నారని బాధితులు తెలిపారు. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు పరామర్శించేందుకు వెళ్లినా అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్, డివిజన్ అధ్యక్షుడు పొట్టోళ్ల దాసు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో ఒక కుటుంబాన్ని ఎనిమిదేళ్లుగా సామాజికంగా వెలివేయడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులకు విరుద్ధమని అన్నారు. కుల బహిష్కరణకు పాల్పడుతున్న వారిని గుర్తించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకోవడం నేరమా? ఒకే గ్రామంలో గౌరవంగా జీవించే హక్కు ఆ కుటుంబానికి లేదా? అని ప్రశ్నించారు.



ఈ వివక్ష ప్రభావం ఆ కుటుంబంలోని పిల్లలపై కూడా పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కుల వివక్ష, సామాజిక బహిష్కరణకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వారు పేర్కొన్నారు. వండుగల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం,శుభకార్యాలకు దూరంగా ఉంచడం,మరణించిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లనీయకపోవడం వంటి ఆంక్షలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. కులం పేరుతో ఎవరినీ సామాజికంగా వెలివేసే హక్కు ఎవరికీ లేదని పేర్కొంటూ,బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కేవీపీఎస్ నాయకులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేతలు వచ్చారు..!! స్కూల్ వాతావరణం వెలుగులోకి తెచ్చారు..!!

కూకట్ పల్లి నవంబర్ 4 (ప్రజా కలం ప్రతినిధి): కూకట్పల్లి బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని ఎంపీపీ భువన విజయం ఇంగ్లీష్ మీడియం ప్రీ ప్రైమరీ నుండి ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాల ప్రాంగణాన్ని కాంగ్రెస్ నేతలు పరిశీలించారు.

కూకట్పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బచ్చు మల్లి ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించారు అక్కడ ఉన్న అసభ్య వాతావరణంలో పాటు, స్కూల్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు త్వరితగతిన మున్సిపల్ శాఖకు ఫిర్యాదు చేసి స్కూలు ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయించారు అదేవిధంగా అక్కడ ఉన్న చెత్తను తొలగించడంతోపాటు అక్కడ ఉన్న సమస్యల గురించి సదరు పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో మాట్లాడి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ స్కూలు ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు విద్యార్థులకు ఇతర సౌకర్యాలు విషయంలో కూడా శ్రద్ధ తీసుకునే విధంగా ముందుకు వెళతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ బాలాజీ నగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ బచ్చు నాగమల్లేశ్వరరావు, కూకట్పల్లి కాన్జెన్సీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ వారా బాబ్జి కుమార్,బాలాజీ నగర్ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ వి మనీ గౌడ్,బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ బిజినెస్ సెల్ ప్రెసిడెంట్ వీర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com